




epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com








సంపుటి : 17 సంచిక : 182 | 10-08-2025 ఆదివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00




## నా వ్యాఖ్యలు వెనక్కు తీసుకోను

- ఫోన్ ట్యాపింగ్‌లో తండ్రీకొడుకుల హస్తం
- కేంద్ర మంత్రి బండి సంజయ్

వార్త 2లో

# రాజ్యాంగం మార్చాలన్న కుట్రలో బిజెపి

- క్విట్ బిజెపి నినాదంతో ముందుకు వెళ్లాల్సిందే
- గాంధీభవన్‌లో క్విట్ ఇండియా కార్యక్రమంలో పిసిసి చీఫ్

2లో

రాజ్యాంగం మార్చాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బిజెపి చర్యలన్నీ ఈ కోవలో భాగంగానే సాగుతున్నాయని అన్నారు. శనివారం గాంధీ భవన్‌లో క్విట్ ఇండియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జెండా ఎగరవేశారు. క్విట్ బిజెపి నినాదంతోనే దేశానికి రక్ష అన్నారు. అలాగే.. ఎలక్షన్ కమిషన్‌పై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు.





## బహుశా రాజకీయాలకు శాశ్వతంగా దూరంగా ఉంటా

మాజీ మంత్రి మల్లారెడ్డి

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి మల్లారెడ్డి తన రాజకీయ జీవితంపై సంచలన కామెంట్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మీడియాతో మల్లారెడ్డి మాట్లాడారు.

వార్త 2లో

## హైకోర్టు ఆదేశాలకనుగుణంగా స్థానిక ఎన్నికలు

కావాలనే రిజర్వేషన్లపై బీజేపీ రాద్ధాంతం

మంత్రి పొన్నం ప్రభాకర్



వార్త 2లో



## ఆర్టీసీ నిర్వహణ నిమిత్తమే చార్జీల పెంపు

పండుగ తర్వాత చార్జీలు యథాతథం ఆర్టీసీ యాజమాన్యం

వార్త 2లో

## సోదరీ సోదరిమణులకు మోదీ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి



రాఖీ పండుగ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సోషల్ మీడియా వేదికగా ఆయన ఈ పండుగ సోదరీ–సోదరుల మధ్య ప్రేమను మరింత పెంచుతుందని గుర్తు చేశారు. అలాగే, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఈ పండుగ సందర్భంగా శు భాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సోదరీ–సోదరుల మధ్య ప్రేమ, నమ్మకం, రక్షణ వంటి అవినాభావ బంధాన్ని సూచిస్తుందని ఆయన అన్నారు. ఈ పండుగ మీ జీవితంలో ఆనందం, ఉత్సాహం నింపాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఈ పండుగ సోదరీమణుల రక్షణ స్ఫూర్తిని మరింత బలపరుస్తుందని ఆయన ఆశించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గారు కూడా ఈ సందర్భంగా తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ శుభ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు. ఈ పండుగ రాఖీ దారం పవిత్రతకు చిహ్నం మాత్రమే కాదు, సోదరీమణుల గౌరవం, భద్రత, ఆనందం, శ్రేయస్సుకు నిబద్ధత కూడా అని గుర్తు చేశారు. ఈ పండుగ మనలో రక్షణ స్ఫూర్తిని బలపరచాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.



## ఆపరేషన్ సిందూర్‌లో ఐదు జెట్లను కూల్చేశాం

ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్

వార్త 2లో

## పిల్లల సమక్షంలో ప్రధాని రక్షాబంధన్

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

ప్రధాని నరేంద్రమోదీ రక్షా బంధన్ వేడుకలను విద్యార్థులు, ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి సభ్యులతో కలిసి జరుపుకొన్నారు. దిల్లీలోని ప్రధాని నివాసంలో శనివారం ఉదయం 7 గంటల సమయంలో పలువురు విద్యార్థులు, బ్రహ్మకుమారి సభ్యులు మోదీకి రాఖీ కట్టారు. అనంతరం మోదీ వారితో కొంతసేపు సరదాగా ముచ్చటించారు. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. గతేడాది కూడా ప్రధాని ఇలాగే స్కూల్ విద్యార్థినులతో రాఖీ కట్టించుకున్న సంగతి తెలిసిందే. అంతకుముందు రాఖీ పండుగను పురస్కరించుకొని దేశ ప్రజలకు మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు.






## 334 రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగింపు

వార్త 2లో

## మాటలతో నిర్వచించలేనిది మా అనుబంధం : సీఎం రేవంత్

హైదరాబాద్: అక్షరకలం ప్రతినిధి

రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క రేవంత్ రెడ్డి నివాసానికి చేరుకుని ఆయనకు రాఖీ కట్టారు. అనంతరం మంత్రి సీతక్కతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు రేవంత్. సోదరి సీతక్క పట్ల ఉన్న అనురాగాన్ని ప్రతిబింబిస్తూ.. ఎక్స్ వేదికగా సీఎం ఎమోషనల్ పోస్ట్ పెట్టారు.



# నా వ్యాఖ్యలు వెనక్కు తీసుకోను

## ఫోన్ ట్యాపింగ్‌లో తండ్రీకొడుకుల హస్తం

## కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్, అక్షరకలం ప్రతినిధి**

ఎప్పటికైనా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ జైలుపాలు కావల్సిందేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్, కేటీఆర్ బీఆర్ఎస్ నేతలందరి ఫోన్లు ట్యాప్ చేశారని ఆరోపించారు. సొంత పార్టీ నేతలపై కేసీఆర్‌కు నమ్మకం లేదన్నారు. తాను నోటీసులు ఇచ్చుకుంటూ పోతే.. తండ్రీ కొడుకులు ఇద్దరూ జీవితాంతం జైల్లోనే ఉంటారంటూ మండిపడ్డారు. మావోయిస్టు సానుభూతిపరులమంటూ తన పేరును, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరును పోలీసుల లిస్టులో చేర్చారని చెప్పారు. శనివారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బీఆర్ఎస్ నేతలకు సిగ్గుంటే పార్టీ నుంచి బయటకు రావాలన్నారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై అసెంబ్లీలో చర్చ ఎందుకు జరపడం లేదు?. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐ ఇస్తే కొల్లిక్కి వస్తుందని పేర్కొన్నారు. రాధాకిషన్ వాంగ్మూలంలో కేసీఆర్ పేరు ఉందని, కానీ విచారణ కోసం కేసీఆర్‌ను ఎందుకు పిలవడం లేదని ప్రశ్నించారు. నేను కూడా కుటుంబ సభ్యులపై ప్రమాణం చేస్తా. ఏ గుడికి రమ్మంటారో టైమ్, డేట్ చెప్పాలని సవాల్ విసిరారు. కేటీఆర్ లీగల్ నోటీసులకు నేను భయపడను' అని అన్నారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బండి సంజయ్ చేసిన ఆరోపణలను కేటీఆర్ ఖండించారు. తాజాగా, బండి సంజయ్‌కి లీగల్ నోటీసు పంపించారు. రాబోయే 48 గంటల్లో తనపై చేసిన ఆరోపణలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎక్స్ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రికి కనీస సాధారణ జ్ఞానం కూడా లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ నిర్లక్ష్యపు ప్రకటనలు హద్దులు దాటాయన్నారు.

# బహుశా రాజకీయాలకు శాశ్వతంగా దూరంగా ఉంటా

## మాజీ మంత్రి మల్లారెడ్డి

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి మల్లారెడ్డి తన రాజకీయ జీవితంపై సంచలన కామెంట్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మీడియాతో మల్లారెడ్డి మాట్లాడారు. తాను రాజకీయంగా బీజేపీ వైపా, తెలుగుదేశం వైపా, బీఆర్ఎస్ పార్టీల వైపా అన్నది కాదని... తాను ఇప్పటికీ కూడా బీఆర్ఎస్‌లోనే ఉన్నానని క్లారిటీ ఇచ్చారు మల్లారెడ్డి. తాను ఇప్పుడు ఏ వైపునకు చూసేటట్లుగా కూడా లేనని స్పష్టం చేశారు. తనకు 73సంవత్సరాలు వచ్చాయని.. ఇంకా ఏవైపునకు చూడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. తాను ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రిని అయ్యానని ఇంకా మూడేళ్లు రాజకీయాల్లో ఉంటానని చెప్పుకొచ్చారు. అస్సలు తాను రాజకీయమే వద్దనుకుంటున్నానని తెలిపారు. ప్రజలకు సేవ చేసి మంచి కాలేజీలు, యూనివర్సిటీలు నడిపిద్దామని అనుకుంటున్నానని మల్లారెడ్డి పేర్కొన్నారు.

# ఆర్టీసీ నిర్వహణ నిమిత్తమే చార్జీల పెంపు

## పండుగ తర్వాత చార్జీలు యథాతథం

## ఆర్టీసీ యాజమాన్యం

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

రాఖీ పండుగకు చార్జీలు పెంచడంపై ప్రయాణికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్టీసీ నిర్వహన కారణంగా కొంత చార్జీలు పెంచినట్టు తెలిపింది. పండుగ తరువాత రేట్లు యథాయథంగా ఉంటాయని వెల్లడించింది. ఈ నెల 11 వరకు స్పెషల్ బస్సుల్లో చార్జీలు పెంచినట్లు వెల్లడించింది. ఆ తర్వాత చార్జీలు సాధారణంగానే ఉంటాయని పేర్కొంది. రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికులు లేకున్నా బస్సులను వెంటనే తిరిగి తీసుకురావాల్సి వస్తుందని, ఈ నేపథ్యంలో నిర్వహణ ఖర్చుల నిమిత్తం స్పెషల్ బస్సుల్లో మాత్రమే చార్జీలు పెంచామని వెల్లడించింది. 'సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, అనుబంధాలకు ప్రతికైనా రాఖీ పౌర్ణమి పర్వదిన సందర్భంగా ప్రయాణికులకు రవాణాపరమైన అసౌకర్యం కలుగకుండా టీజీఎస్ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ప్రతి ఏడాది మాదిరిగానే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం రాఖీ పండుగకు నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో మాత్రమే రూ. 1.50 వరకు టికెట్ ధరలను సవరించింది. స్పెషల్ బస్సులు మినహా రెగ్యూలర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. ఈ నెల 11వ తేదీ వరకు నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే ఈ సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేసింది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ.. రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీవో ప్రకారం స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను రాఖీ పండుగ సందర్భంగా సంస్థ సవరించింది. రాఖీ పౌర్ణమికి ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేయొద్దని ప్రజలకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సూచిస్తోంది. ఆర్టీసీ సిబ్బంది ఎంతో అనుభవజ్ఞులని, సొంతూళ్లకు వెళ్లే వారు తమ బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరుతూ.. అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తోంది.' అని తెలిపింది. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్లలో రాఖీ పండుగ ప్రయాణికుల రద్దీ నెలకొంది. సికింద్రాబాద్ జేబీఎస్, ఎంజీబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్ బస్టాండ్లలో బస్సుల కోసం ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు.

# హైకోర్టు ఆదేశాలకనుగుణంగా స్థానిక ఎన్నికలు

**హైదరాబాద్,**

బీసీల రిజర్వేషన్లపై బీజేపీ పార్టీ కావాలనే రాద్ధాంతం చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే స్థానిక ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని తమ ప్రభుత్వం ఎక్కడా పేర్కొనలేదని స్పష్టంచేశారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టినప్పుడు బీజేపీ నేతలు మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు కావాలనే బీజేపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. రాష్ట్ర, దేశ ప్రజలకు రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో వారి సోదరులకు మంత్రి సీతక్క రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సీతక్కకు మంత్రి పొన్నం చీరను బహూకరించారు. సీతక్క నుంచి పొన్నం ప్రభాకర్ ఆశీర్వాదం తీసుకున్నారు. సీతక్కకు పొన్నం ప్రభాకర్ సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, రాఖీ పర్వదినం సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ రాఖీ కట్టారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కి మంత్రి సీతక్క రాఖీ కట్టారు. సోదరి సీతక్క అంటూ ఆత్మీయంగా పలకరించి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి శ్రీధర్ బాబుకి మంథని నియోజకవర్గ మహిళలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

# రాజ్యాంగం మార్చాలన్న కుట్రలో బిజెపి

## క్విట్ బిజెపి నినాదంతో ముందుకు వెళ్లాల్సిందే

## గాంధీభవన్‌లో క్విట్ ఇండియా కార్యక్రమంలో పిసిసి చీఫ్

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**







రాజ్యాంగం మార్చాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బిజెపి చర్యలన్నీ ఈ కోవలో భాగంగానే సాగుతున్నాయని అన్నారు. శనివారం గాంధీభవన్‌లో క్విట్ ఇండియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జెండా ఎగరవేశారు. క్విట్ బిజెపి నినాదంతోనే దేశానికి రక్ష అన్నారు. అలాగే.. ఎలక్షన్ కమిషన్‌పై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. ఈ సమావేశంలో టీ–పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. రాష్ట్ర, దేశ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమం ఏ విధంగా జరిగిందో నేటి యువత తెలుసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. 1942లో బ్రిటీ–ష్ పాలకులను తరిమి కొట్టాలని అనేక ఉద్యమాలు జరిగినప్పటికీ క్విట్ ఇండియా ఉద్యమం కీలకమైనదని ఉద్ఘాటించారు. డూ ఆర్ డై నినాదంతో మహాత్మా గాంధీ క్విట్ ఇండియా ఉద్యమం చేశారని కొనియాడారు. నేడు అధికారంలో ఉన్న బీజేపీ.. కాంగ్రెస్ చరిత్రను తుడిచివేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్.. నెహ్రూ, సర్దార్, సుభాష్ చంద్రబోస్ లాంటి నేతలను చరిత్రలో లేకుండా చేద్దామని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్వతంత్ర సంస్థలను వాడుకొని ప్రతిపక్షాలపై మోదీ ప్రభుత్వం కుట్ర పూరిత దాడి చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎలక్షన్ కమిషన్.. బీజేపీ ఫ్రంటల్ ఆర్గనేషన్‌గా మారిందని ఆక్షేపించారు. ప్రశ్నిస్తే దేశ ద్రోహుల ముద్ర వేస్తున్నారని దుయ్యబట్టారు. క్విట్ బీజేపీ అంటేనే దేశానికి భవిష్యత్తు అని ఉద్ఘాటించారు. కులాలు, మతాల పేరిట బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేస్తోందని విమర్శించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక్కరంటే ఒక్కరూ కూడా బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు లేరని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ దేశ స్వాతంత్ర్య కోసం ఉద్యమం చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఈ దేశ రక్షణ కోసం పని చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ఆపరేషన్ సిందూర్‌లో ఐదు జెట్లను కూల్చేశాం

## ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్

**ఢిల్లీ,**

ఆపరేషన్ సింధూర్ సందర్భంగా పాకిస్తాన్‌కు చెందిన ఐదు ఫైటర్ జెట్లను కూల్చేశామని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సాయంతో ఐదు పాకిస్తాన్ జెట్లను పేల్చిపడేశాము. ఐదు జెట్లను మాత్రమే కాకుండా.. ఓ భారీ 'ఎయిర్‌బర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్ క్రాఫ్ట్'ను కూడా కూల్చేశాము. రెండు వైమానిక స్థావరాలు ధ్వంసం చేశాం. మే 9, 10 తేదీల్లో ఆపరేషన్ సిందూర్ నిర్వహించాం. మే 9వ తేదీ రాత్రి ఎక్కువగా పాక్ ఉగ్ర శిబిరాలపై దాడులు చేశాం. డ్రోన్, ఎస్ 400 గగనతల రక్షణ వ్యవస్థ బాగా పనిచేసింది. వారి యుద్ధ విమానాలు భారత గగనతలంలోకి ప్రవేశించకుండా అడ్డుకున్నాం. వాటిని ఎంతో సమర్థవంతంగా కూల్చిపడేశాం. ఆపరేషన్ సింధూర్‌తో పాక్‌కు స్పష్టమైన సందేశమిచ్చాం' అని ఆయన అన్నారు. కాగా, ఏప్రిల్ 22వ తేదీన జమ్మూకాశ్మీర్, పహల్గామ్‌లోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. అమాయక పర్యాటకులను కాల్చి చంపారు. 26 మందిని బలి తీసుకున్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు చేసింది. దీంతో 100 మంది ఉగ్రవాదులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉగ్రవాదులు పెద్ద సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకోవటంతో పాక్ తట్టుకోలేకపోయింది. యుద్ధానికి దిగింది. యుద్ధంలో భారీ ఎత్తున నష్టపోయింది. చివరకు తోకముడిచింది.

# 334 రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగింపు

## నిర్ణయం తీసుకున్న ఈసీ

**న్యూఢిల్లీ,**

దేశవ్యాప్తంగా 334 రాజకీయ పార్టీలను రిజిస్టర్ జాబితా నుంచి ఎన్నికల సంఘం (ఈసీ) తొలగించింది. 2019 నుంచి ఏ ఒక్క ఎన్నికల్లో పోటీ చేయని ఈ రాజకీయ పార్టీలపై ఈ నిర్ణయం తీసుకున్నది. ఈసీ వద్ద రిజిస్టర్ అయినప్పటికీ గుర్తింపులేని 334 రాజకీయ పార్టీలు 2019 నుంచి ఆరేళ్లలో ఏ ఒక్క ఎన్నికల్లో కూడా పోటీ చేయలేదని ఈసీ తెలిపింది. ముఖ్యమైన ఈ షరతును నెరవేర్చడంలో విఫలమైనందుకు రిజిస్టర్ అయిన 334 గుర్తింపు లేని రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు శనివారం పేర్కొంది. కాగా, గుర్తింపు లేని ఈ 334 రాజకీయ పార్టీలు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందినవని ఈసీ తెలిపింది. అయితే జాబితా నుంచి తొలగించిన ఈ పార్టీల కార్యాలయాలు భౌతికంగా కూడా ఎక్కడా లేవని పేర్కొంది. మొత్తం 2,854 నమోదిత గుర్తింపు లేని రాజకీయ పార్టీల్లో 334 పార్టీల తొలగింపు తర్వాత 2,520 రాజకీయ పార్టీలు రిజిస్టర్ జాబితాలో ఉన్నట్లు ఈసీ వివరించింది. ప్రస్తుతం ఆరు జాతీయ పార్టీలు, 67 రాష్ట్ర పార్టీలు ఉన్నాయని వెల్లడించింది.

# ఢిల్లీలో కుండపోత వర్షాలు

## గోడకూలిన ఘటనలో ఏడురుగు మృతి

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న కుండపోత వర్షం కారణంగా పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. జైత్‌పూర్‌లో శనివారం ఉదయం గోడ కూలిపోవడంతో ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కొంతమంది శిథిలాల కింద చిక్కుకున్నారు. గాయపడినవారిని ఆసుపత్రికి తరలించారు. రంగంలోకి దిగిన పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలో భారీ వర్షాలకు గోడకూలి ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. హస్తినలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్టు– తెలుస్తోంది. ఢిల్లీలోని హరినగర్ లో ఈ ఘటన చోటు–చేసుకుంది. ఈ ప్రమాదంలో 8 మందిని రక్షించారు, తీవ్రంగా గాయపడ్డ నలుగురుని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భారీగా కురిసిన వర్షం కారణంగా హరి నగర్‌లోని జైత్‌పూర్ ప్రాంతంలో గోడ కూలిపోవడంతో, పాత ఆలయం పక్కనే ఉన్న జగ్గీలలో నివసిస్తున్న వాళ్లు ఈ ప్రమాదంలో చిక్కుకున్నారు. భవిష్యత్తులో అలాంటి ఘటనలు జరగకుండా జగ్గీలను ఖాళీ చేయించామని సౌత్ ఈస్ట్ అదనపు డీసీపీ ఐశ్వర్య శర్మ తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ అగ్నిమాపక బృందాలు తక్షణమే రంగంలోకి దిగి సహాయక చర్యను ప్రారంభించాయి. మృతులను షబీబుల్ (30), రబీబుల్ (30), అలీ (45), రుబినా (25), డాలీ (25), రుక్సానా (6) హసీనా (7) గా గుర్తించారు. ఢిల్లీలోని సివిల్ లైన్స్‌లో నిర్మాణంలో ఉన్న భవనం కూలిపోయి ఇద్దరు మృతి చెందిన ఘటన జరిగిన పది రోజుల తర్వాత ఈ ప్రమాదం చోటు–చేసుకుంది. ఢిల్లీ ఇవాళ భారీ వర్షాలతో అతలాకుతలమైంది. వర్షాల కారణంగా దేశ రాజధానిలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షాల కారణంగా వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాల కారణంగా విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాతావరణ శాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం, శనివారం ఉదయం 8.30 గంటల వరకు సఫ్దర్‌జంగ్‌లోని ఢిల్లీ ప్రాథమిక వాతావరణ కేంద్రంలో 78.7 మి.మీ., ప్రగతి మైదాన్‌లో 100 మి.మీ., లోధి రోడ్‌లో 80 మి.మీ., పూసాలో 69 మి.మీ., పాలంలో 31.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. అటు–, యమునా నది నీటి మట్టం కూడా ప్రమాదకర స్థాయి 204.50 మీటర్లకు చేరుకుంది. ఓల్డ్ రైల్వే వంతెన దగ్గర ఉదయం 9 గంటలకు నీటి మట్టం 204.40 మీటర్లు ఉంది. దీంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# మిలటరీ, సాంకేతిక అంశాలపై రష్యాతో భేటీ

**న్యూఢిల్లీ,**

జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పర్యటన కొనసాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా మొన్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమైన దోవల్.. తాజాగా ఆ దేశ ఉప ప్రధాని డెనిస్ మంతురోవ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మిలిటరీ–సాంకేతిక ఒప్పందాలపై ద్వైపాక్షిక చర్చలు జరిపినట్లు రష్యా రాయబార కార్యాలయం ప్రకటించింది. పౌర విమానాల తయారీ, రసాయన పరిశ్రమ సహా ఇతర వ్యూహాత్మక రంగాల్లో ఉమ్మడి ప్రాజెక్టుల పురోగతిని ఇరుపక్షాలు సమీక్షించినట్లు పేర్కొంది. కాగా, ఈనెల 7న పుతిన్‌తో దోవల్ భేటీ అయిన విషయం తెలిసిందే. క్రెమ్లిన్ వేదికగా నిర్వహించిన ఈ సమావేశంలో రష్యా భద్రతామండలి సెక్రటరీ సెర్గీ షోయిగు, క్రెమ్లిన్ సహాయకుడు యూరి ఉషకోవ్ పాల్గొన్నారు. రష్యా చమురు కొనుగోళ్లతో భారత్‌పై అమెరికా అధిక సుంకాలు వధించిన వేళ దోవల్ మాస్కో పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు రష్యా అధినేత పుతిన్‌తో ప్రధాని ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ ఏడాదిలో స్వదేశంలో భారత్, రష్యా 23వ వార్షిక సమావేశం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పిన మోడీ.. ఉక్రెయిన్ యుద్ధం పురోగతి విషయమై రష్యా అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. 'స్నేహితుడు పుతిన్‌తో సంభాషణ సమగ్రంగా, ఉపయుక్తంగా సాగింది. ఉక్రెయిన్ యుద్ధం తాజా అప్‌డేట్స్ విషయంలో ఆయనకు ఫోన్‌లోనే ధన్యవాదాలు తెలియజేశాను. భారత్, రష్యాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై కూడా ఇద్దరం చర్చించాం. అంతేకాదు రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే విషయంలో కట్టుబడి ఉన్నామని పుతిన్‌తో చెప్పాను. ఈ ఏడాది చివర్లో పుతిన్‌ను భారత్‌కు ఆహ్వానించనున్నాను' అని మోడీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై మరోసారి భారత్ తటస్థ వైఖరిని మోడీ స్పష్టం చేశారు. ఇరు దేశాధినేతలు చర్చించుకొని.. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

# మంగళగిరి మహిళలే నా అక్కచెల్లెళ్లు: లోకేశ్

**గుంటూరు,**

సోదరి లేని తనకు మంగళగిరి మహిళలే అక్కాచెల్లెళ్లు అని మంత్రి లోకేష్ అన్నారు. శనివారం రాఖీ పండుగను పురస్కరించుకొని ఉండవల్లిలోని మంత్రి నివాసంలో మంత్రి లోకేష్‌కు మంగళగిరి మహిళలు పెద్ద ఎత్తున వచ్చి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ... రాఖీకట్టి తనకు అందించిన ఆశీస్సులు కొండంత బలాన్నిచ్చాయన్నారు. మంగళగిరి ఆడబిడ్డలందరికీ నేను ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. మంగళగిరిలో త్వరలోనే మరో విడత ఇళ్ల పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు- చేస్తున్నాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 200 అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్, గ్యాస్ పైప్‌లైన్ల ఏర్పాటు-, 100 పడకల ఆసుపత్రి, స్వర్ణకారుల కోసం జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు వంటివి పురోగతిలో ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లన్నీ అభివృద్ధి చేస్తున్నాం. మహా ప్రస్థానం పేరుతో శ్మశాన వాటికల నిర్మాణం, పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా మంగళగిరి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం ' అని అన్నారు.

# పోలీసులకు రాఖీ కట్టిన హోంమంత్రి అనిత

**విశాఖపట్టణం,**

రక్షాబంధన్ పండుగ సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు హోం మంత్రి అనిత రాఖీ కట్టారు. విశాఖ ఎంవీపీ కాలనీ నుంచి ఉషోదయ జంక్షన్ వరకు మంత్రి అనిత ఆటోలో ప్రయాణించారు. ఆటోడ్రైవర్ గిరీష్ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనకు కూడా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న కానిస్టేబుల్ కొర్లయ్యను పరామర్శించి రాఖీ కట్టారు. ఆయనకు ధైర్యం చెప్పిన మంత్రి.. సహాయం అందిస్తామని భరోసానిచ్చారు.

# ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డిపై కేసు నమోదు

**కడప,**

: వైసిపి కడప ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డితో పాటు- పలువురు వైసీపీ నేతలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారిన సంగతి తెలిసిందే. మరోవైపు, పులివెందుల మండలం తుమ్మలపల్లికి చెందిన విశ్వనాథరెడ్డి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అయితే పార్టీ మారినందుకు అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కరరెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, అవినాశ్ పీఏ రాఘవరెడ్డిలతో పాటు- తమ గ్రామానికి చెందిన గంగాధర్ రెడ్డిలు తనను తీవ్రంగా బెదిరించారని విశ్వనాథరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోన్ కాల్ డేటాను కూడా పోలీసులకు అందజేశారు. విశ్వనాథరెడ్డి ఫిర్యాదు మేరకు పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. 41ఏ కింద నిందితులకు నోటీ-సులు ఇచ్చారు. మాజీ మంత్రి వివేకా హత్య కేసులో నిందితులుగా ఉన్న భాస్కరరెడ్డి, శివశంకర్ రెడ్డి బెయిల్ షరతుల మేరకు హైదరాబాద్ లో ఉన్నారు. దీంతో, పులివెందుల పోలీసులు హైదరాబాద్ కు వెళ్లి వారికి నోటీ-సులు అందించారు. మూడురోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీ-సులో పేర్కొన్నారు. మిగిలిన నిందితులకు పులివెందులలోనే నోటీ-సులు అందించారు.

# చెట్టుకు రాఖీ కట్టిన కేంద్ర మంత్రి

**భోపాల్,**

దేశవ్యాప్తంగా శనివారం రాఖీ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఓ చెట్టుకు రాఖీ కట్టారు మంత్రి శివరాజ్. వృక్షాలు ఆక్సిజన్ అందిస్తాయని, పక్షులు..ఇతర జీవాలు కూడా చెట్లను జీవాధారంగా భావిస్తాయని ఆయన అన్నారు. చెట్టుకు రెండు రాఖీలు కట్టిన ఆయన.. హారతి కూడా ఇచ్చారు. ఆ తర్వాత కొందరు మహిళలు, అమ్మాయిలు.. మంత్రి శివరాజ్‌కు రాఖీ కట్టారు. ఆ ఆడపడుచులను ఆయన ఆశీర్వదించారు.

# ఐసీఐసీఐ బ్యాంకు కనీస బ్యాలెన్స్ రూ. 50 వేలు

**న్యూఢిల్లీ,**

ఐసీఐసీఐ బ్యాంక్ ప్రతి నెలా కనీస బ్యాలెన్స్‌ను పెంచేసింది. కొత్త కస్టమర్లకు ఈ రూల్ వర్తించనున్నది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఇది అమలులోకి వస్తోంది. మెట్రో, అర్బన్ లొకేషన్లలో ఉన్న కస్టమర్లు.. తమ సేవింగ్స్ ఖాతాల్లో కనీస బ్యాలెన్స్‌ను 50 వేలు మెయింటేన్ చేయాల్సి ఉంటుంది. పెనాల్టీలు తప్పించుకోవాలంటే కనీస బ్యాలెన్స్ తప్పనిసరి అవుతుంది. బ్యాంక్ తన వెబ్‌సైట్‌లో ఈ తాజా సమాచారాన్ని పోస్టు చేసింది. అయితే పాత కస్టమర్లకు మాత్రం కనీస బ్యాలెన్స్ 10వేలు మాత్రమే ఉంచింది. సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఉన్న కొత్త కస్టమర్లకు.. కనీస బ్యాలెన్స్ 25వేలుగా ఫిక్స్ చేశారు. గ్రామీణ ప్రాంత కస్టమర్లకు దీన్ని 10వేలుగా నిర్ధారించారు. అయితే రూరల్ , సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఉన్న పాత కస్టమర్లకు కనీస బ్యాలెన్స్ 5వేలుగా ఉంది. కనీస బ్యాలెన్స్ మెయింటేన్ చేయని వారు ఆరు శాతం ఫైన్ కట్టాల్సి ఉంటుంది.సేవింగ్స్ ఖాతాలో మూడు సార్లు ఉచితంగా క్యాష్ డిపాజిట్ కోసం అవకాశం కల్పించారు. ఆ తర్వాత ప్రతి ట్రాన్‌జాక్షన్‌కు 150 చెల్లించాల్సి ఉంటుంది. కాంప్లిమెంటరీ క్యాష్ విత్‌డ్రాలను నెలకు మూడుసార్లు మాత్రమే చేశారు. సేవింగ్స్ అకౌంట్‌లో థర్డ్ పార్టీ క్యాష్ డిపాజిట్ ప్రతి ట్రాన్‌జాక్షన్‌కు 25వేలుగా ఫిక్స్ చేశారు.

# రాహుల్‌గాంధీకి శరద్‌పవార్ మద్దతు

**ఢిల్లీ,**

మహారాష్ట్ర రాజకీయాల్లో అనేక మార్పులు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శరద్ పవార్ తాజాగా రాహుల్ గాంధీకి మద్దతుగా నిలిచారు. రాహుల్ గాంధీ ఇటీవల ఓ ప్రెజెంటేషన్ ద్వారా ఓట్ల దొంగతనం, ఫేక్ ఓటర్ల లిస్ట్ గురించి ప్రస్తావించారు. దీనిపై శరద్ పవార్ తనదైన శైలిలో స్పందించారు. ఈ విషయాన్ని భారత ఎన్నికల కమిషన్ సమగ్రంగా పరిశీలించాలని, ఇది చిన్న విషయం కాదన్నారు. వాటిలో కర్ణాటక, మహారాష్ట్రలలో ఎన్నికలు లేకపోయినా, దేశవ్యాప్తంగా పద్ధతిగా జరిగే ఎన్నికల మీద ఇలాంటి అంశాలు ప్రభావం చూపుతాయని ఆయన హెచ్చరించారు. రాహుల్ గాంధీ ఈ విషయాలను ప్రస్తావించే ముందు స్పష్టమైన అధ్యయనం చేశారని పవార్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీంతోపాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇండియాపై తిరిగి 25% నుంచి 50% వరకు దిగుమతి సుంకాలు పెంచే ప్రతిపాదన చేయడం పట్ల శరద్ పవార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భారత్‌పై ఒత్తిడి తేవాలనే ప్రయత్నం అని ఆయన పేర్కొన్నారు. విదేశాంగ విధానాల్లో మన దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా ఆయన స్వరం పెంచారు. పాకిస్తాన్ శత్రువులా మారింది, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకతో సంబంధాలు అంత మంచిగా లేవన్నారు. మనం ఈ సంబంధాలను మెరుగుపరచుకోవాలన్నారు. ప్రధాని మోదీ ఈ విషయాలను పట్టించుకోవాలని పవార్ హితవు పలికారు. అజిత్ పవార్‌తో శరద్ పవార్ కలిసి కనిపించడం, ప్రత్యేకించి కుటుంబ వేడుకల్లో కలసి కనిపించడం రాజకీయంగా కొత్త చర్చకు తావిచ్చింది. ఇటీవల ముంబైలో జరిగిన యుగేంద్ర పవార్ నిశ్చితార్థ వేడుకలో శరద్ పవార్, అజిత్ పవార్ ఇద్దరూ కలిసి పాల్గొన్నారు. దీంతో శివసేన బీజేపీ కూటమికి శరద్ పవార్ మద్దతు ఇవ్వబోతున్నారా? అనే చర్చ మొదలైంది. కానీ శరద్ పవార్ తన పాత ధోరణి గురించి స్పష్టం చేశారు. బీజేపీకి ఎప్పటికీ మద్దతు ఇవ్వనని, రాజకీయాల్లో తన సిద్ధాంతాలకే కట్టుబడి ఉంటానని మరోసారి గుర్తు చేశారు.

# యాంటీ ర్యాగింగ్ వీక్ పెట్టాల్సిందే

## మెడికల్ కళాశాలలకు ఎన్ఎంసీ ఆదేశాలు



**హైదరాబాద్,**

దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో ఆగస్టు 12 నుంచి ఆగస్టు 18 వరకు యాంటీ ర్యాగింగ్ వీక్‌ను పాటించాలని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తన పరిధిలోని అన్ని మెడికల్ కాలేజీలను కోరుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఆగస్టు 12వ తేదీని యాంటీ ర్యాగింగ్ డేగా అన్ని మెడికల్ కాలేజీల్లో సెలబ్రేట్ చేసుకోవాలని పేర్కొంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీలకు ఈ ఆదేశాలు జారీ చేసింది. యూజీసీ నిర్దేశించిన యాంటీ-ర్యాగింగ్ ఫ్రేమ్‌వర్క్ అమలులో భాగంగా దీనిని పాటించాలని తన నోటీసులో పేర్కొంది. ఈ నిబంధనలు తప్పనిసరని స్పష్టం చేసింది. అన్ని ఉన్నత విద్యా సంస్థలు ఈ నిబంధనలలో పేర్కొన్న పర్యవేక్షణ విధానాలుతో సహా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని కూడా పేర్కొంది. యాంటీ-ర్యాగింగ్ వీక్ సందర్భంగా మెడికల్ కాలేజీల్లో పలు కార్యకలాపాలను నిర్వహించాలని యూజీసీ వివరించింది. ఈ సందర్భంగా యాంటీ-ర్యాగింగ్ వీక్ ప్రారంభోత్సవ కార్యక్రమాలు, నినాదాలు రాయడం, వ్యాస రచన, పోస్టర్ తయారీ, ఫోటోగ్రఫీ పోటీలు, వీధి నాటకాలు, యాంటీ-ర్యాగింగ్ ఇతివృత్తాలపై డిబేట్స్ వంటి కార్యకలాపాలతో విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని సూచించింది. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేసి, వారిని భాగస్వాములను చేయాలని తెలిపింది. డిజిటల్ పోస్టర్లు, షార్ట్ వీడియోలు, యాంటీ-ర్యాగింగ్ సందేశాలను హైలైట్ చేసే రీల్స్‌పై దృష్టి సారించేలా నేషనల్ కాంటెస్ట్ 2025 ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి కాలేజీలు, యూనివర్సిటీలు కృషి చేయాలని యూజీసీ ఆదేశించింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు యాంటీ-ర్యాగింగ్ పోర్టల్ అందుబాటులో ఉన్నాయి. విద్యా సంస్థలు డిజిటల్ ప్రచారం కూడా చేయవచ్చు. ర్యాగింగ్ వ్యతిరేక సందేశాలను ప్రోత్సహించే సంస్థల నుంచి వీడియో సందేశాలను వినియోగించవచ్చని వివరించింది. వర్క్‌షాప్‌లు, సెమినార్లు, ఇంటరాక్టివ్ సెషన్‌లు, సెల్ఫీ కార్నర్‌ల వంటి సృజనాత్మక మార్గాలు వంటి అవగాహన కార్యకలాపాలను క్యాంపస్‌లో ఏర్పాటు చేయాలని సూచించింది. ఆఫ్‌లైన్ కార్యకలాపాలతో పాటు విద్యార్థులు, అధ్యాపకుల కోసం విద్యా సంస్థలు యాంటీ-ర్యాగింగ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న షార్ట్ మువీలు, అవగాహన వీడియోలను ప్రదర్శించాలని సంస్థలకు సూచించింది.

# భారత్‌పై ద్వేషంతో ఆ దేశం 400 కోట్లు నష్టపోయింది

**ఢిల్లీ,**

పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ ఎన్నో నిర్ణయాలు తీసుకుని వాటిని అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో పాకిస్థాన్ కూడా భారత్‌కు వ్యతిరేకంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంది. భారత్ విమానాలకు గగనతలాన్ని మూసేయడం ఆ వ్యతిరేక నిర్ణయాల్లో ఒకటి. అయితే పాకిస్థాన్ తీసుకున్న ఆ నిర్ణయం ఆ దేశానికి తీవ్ర నష్టం కలుగజేసింది. ఈ నిర్ణయం కారణంగా పాకిస్థాన్ రెండు నెలల్లోనే దాదాపు రూ.400 కోట్లు కోల్పోయింది. భారత్ నుంచి వచ్చే విమానాలను ఏప్రిల్ 24వ తేదీ నుంచి పాకిస్థాన్ తన గగనతలంలోకి అనుమతించడం లేదు. ఈ నిషేధం ఇప్పటికీ కొనసాగుతోంది. నిజానికి భారత్ నుంచి వెళ్లే అంతర్జాతీయ విమానాలు చాలా వరకు పాకిస్థాన్ గగనతలాన్ని వాడుకుంటాయి. పాక్ గగనతలం మీదుగా రోజుకు 100 నుంచి 150 భారతీయ విమానాలు ప్రయాణిస్తుంటాయి. ఇలా గగనతలాన్ని వాడుకున్నందుకు ఓవర్ ఫ్లైయింగ్ ఛార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క బోయింగ్ విమానం పాక్ గగనతలం మీదుగా ప్రయాణిస్తే దాదాపు 580 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. పాకిస్థాన్ గగనతలం మూసేయడంతో భారత్ విమానాలు వేరే మార్గాల్లో ప్రయాణిస్తున్నాయి. దీంతో ఆ ఓవర్ ఫ్లైయింగ్ ఛార్జీలను పాకిస్థాన్ కోల్పోయింది. ఏప్రిల్ 24 నుంచి జూన్ 20 మధ్యలో పాకిస్థాన్ ఎయిర్ పోర్ట్స్ అథారిటీకి రూ.410 కోట్ల నష్టం వాటిల్లింది. ఈ విషయాన్ని పాక్ రక్షణ మంత్రిత్వ శాఖ అక్కడి అసెంబ్లీలో వెల్లడించినట్లు డాన్ నివేదించింది. ఈ ఆంక్షల వల్ల పాకిస్థాన్ ఏడాదికి వేల కోట్ల రూపాయలను కోల్పోతుందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.

# కోర్ట్ ఆఫ్ ఆస్తుల కింద ప్రభుత్వానికి లక్షల కోట్లు

## మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు

**హైదరాబాద్,**

కోర్ట్ ఆఫ్ వార్డ్స్ ఆస్తుల కింద రాష్ట్ర ప్రభుత్వానికి లక్షల కోట్ల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉందని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్ రావు తెలిపారు. గత ముఖ్యమంత్రులు రాజశేఖర్ రెడ్డి, రోశయ్య ఇతరులకు చెప్పానని.. వారు పట్టించుకోలేదని చెప్పుకొచ్చారు. ఢిల్లీ వేదికగా శనివారం మీడియాతో గోనె ప్రకాష్ రావు మాట్లాడారు. ప్రస్తుత రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కూడా చెప్పానని.. దీనిపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోరానని.. వారిని కలిసి ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఏఐసీసీ పెద్దలకు కలిసి తన వద్ద ఉన్న వివరాలు అందిస్తానని స్పష్టం చేశారు గోనె ప్రకాష్ రావు.తెలంగాణలో 6 రాజ కుటుంబాల ఆస్తులు, ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన ఆస్తులు ప్రైవేట్ వారి చేతుల్లో ఉన్నాయని గుర్తుచేశారు. బ్రిటిష్ చట్టం కాబట్టి దీనిపై ఎవరు ఏమి చేయలేకపోతున్నారని అన్నారు. ల్యాండ్ క్రూజర్ కార్లు, ఇన్నోవా కార్లపై మాత్రమే ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టి ఉందని వెల్లడించారు. రేపు ప్రతి మంత్రి హెలికాప్టర్‌లో తిరగాలని ప్లాన్ చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చాలని తాను చూస్తున్నానని తెలిపారు గోనె ప్రకాష్ రావు. రెండు రోజుల్లో కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిని కలుస్తానని.. ఆ ఆస్తులను కాపాడాలని కోరుతానని గోనె ప్రకాష్ రావు చెప్పారు. గతంలో ఈ విషయంపై జానారెడ్డి అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రంలో పూర్తయిన తర్వాత కేంద్రంలో కూడా కోర్ట్ ఆఫ్ వార్డ్స్ ఆస్తుల అంశాన్ని బీజేపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పుకొచ్చారు. ఆదాయాన్ని సమకూర్చుకుంటే రెండు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజా హితం కోసం తన వంతుగా ఈ విసయంపై ప్రయత్నం చేస్తున్నానని గోనె ప్రకాష్ రావు పేర్కొన్నారు.



# గోవాలో తెలుగు జంటపై దాడి

**హైదరాబాద్,**

గోవాలో మరో దారుణం చోటుచేసుకుంది.. గోవా విహార యాత్రలో ఉన్న హైదరాబాద్‌కు చెందిన ఓ జంటపై పనాజీ బస్‌స్టాండ్ వద్ద దాడి జరిగింది. బైక్ అద్దె విషయంలో జరిగిన చిన్నపాటి వివాదం ఘర్షణకు దారి తీసింది. వరుసగా సెలవులు రావడంతో.. హైదరాబాద్ కు చెందిన ఈ జంట గోవాలో గడిపేందుకు వెళ్లారు. అక్కడ ప్రయాణానికి బైక్ అద్దెకు తీసుకున్నారు. ఒప్పందం ప్రకారం.. బైక్‌ను సమయానికి తిరిగి అప్పగించినప్పటికీ.. బైక్ అద్దెకు ఇచ్చినవాళ్లు అదనంగా రూ.200 చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. దీంతో ఎందుకు చెల్లించాలంటూ వారు.. బైక్ అద్దెకు ఇచ్చిన వారిని ప్రశ్నించారు. ఈ విషయంలో ఇరువురు మధ్య వాగ్వాదం తలెత్తింది.. ఈ క్రమంలో పనాజీ బస్‌స్టాండ్ సమీపంలో ఉన్న కొంతమంది బైక్ అద్దెకు ఇచ్చే వ్యక్తులు గుంపుగా వచ్చి జంటపై దాడికి పాల్పడ్డారు. దాడిలో హైదరాబాద్ వ్యక్తి తలకు గాయాలపాలయ్యారు. గర్భిణి అయిన మహిళకు ముఖం తీవ్రంగా ఉబ్బిపోయింది. గాయాలైన జంటను వెంటనే గోవా మెడికల్ కాలేజ్‌కి తరలించారు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇలాంటి ఘటనలు గోవాలో పర్యాటకుల భద్రతపై ప్రశ్నలు రేపుతున్నాయి. పోలీసులు పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుల కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో కూడా గోవాలో జరిగిన గొడవలో ఏపీకి చెందిన ఓ యువకుడు మరణించిన విషయం తెలిసిందే.. ఇలాంటి ఘటనల నేపథ్యంలో గోవాకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండటం మంచిదని పోలీసులు చెబుతున్నారు.

# సేవింగ్స్ ఖాతా బ్యాలెన్స్ 50వేలు

## ఐసిఐసిఐ బ్యాంక్ నిర్ణయం

**న్యూఢిల్లీ,**

ప్రైవేట్ రంగానికి చెందిన ఐసీఐసీఐ బ్యాంక్ తన సేవింగ్స్ ఖాతాల కనీస సగటు- బ్యాలన్స్ నిబంధనల్లో భారీ పెంపు చేస్తున్నట్లు- ప్రకటించింది. ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ మార్పు మెట్రో, అర్బన్, సెమీ-అర్బన్, గ్రామీణ బ్రాంచ్‌ల ఖాతాదారులందరిపై ప్రభావం చూపనుంది. ఈ పెంపుతో దేశీయ బ్యాంకులలో అత్యధిక 'కనీస సగటు- బ్యాలన్స్' ఐసీఐసీఐ బ్యాంక్‌దే అవుతోంది. కొత్తగా సవరించిన నిబంధనల ప్రకారం.. మెట్రో, అర్బన్ ప్రాంతాల ఖాతాదారులు సగటు-న 50,000 కనీస నిల్వ ఉంచాలి. ఇది ఇంతకుముందు ఉన్న 10,000 నుంచి 50,000 కు పెరగడంతో.. ఐదు రెట్లు- పెరిగినట్టే. సెమీ-అర్బన్ బ్రాంచ్‌లలో కనీస బ్యాలెన్స్ 5,000 నుంచి 25,000కు పెరిగింది. అలాగే గ్రామీణ బ్రాంచ్‌లలో మాత్రం 2,500 నుంచి 10,000కు పెంచారు. ఇకపోతే, దేశంలోనే అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2020లోనే మినిమమ్ బ్యాలెన్స్ నిబంధనను పూర్తిగా రద్దు చేసింది. ఇతర బ్యాంకులు సాధారణంగా 2,000 నుంచి 10,000 వరకు మాత్రమే ఉంచేలా నిబంధనలు అమలు చేస్తుంటాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మెట్రో, అర్బన్‌లో 10,000, సెమీ-అర్బన్‌లో 5,000, గ్రామీణ బ్రాంచ్‌లలో 2,500గా ఉంచింది. బ్యాంకులు తమ రోజువారీ కార్యకలాపాలు, పెట్టు-బడుల ఖర్చులను తీర్చుకునేందుకు మినిమమ్ బ్యాలెన్స్ నిబంధనలను అమలు చేస్తాయి. ఈ పరిమితి కంటే తక్కువ నిల్వ ఉంచిన ఖాతాదారులపై జరిమానాలు కూడా వేస్తుంటాయి. ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ఆగస్టు 1 నుంచి కొత్త నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత సవరించిన ఫీజు చార్ట్ ప్రకారం జరిమానాలు విధించనుంది.

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

## ఆర్టీసీలో నోటిఫికేషన్

**హైదరాబాద్,**

తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సుల్లో చేరాలనుకొనే విద్యార్థులు టీజీఎస్‌ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. హైదరాబాద్ శివారులోని హకీంపేట్‌లో ఐటీఐ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎనిమిది, పదో తరగతి విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కాలేజీలో మోటార్ వెహికల్ మెకానిక్, మెకానిక్ డీజిల్, వెల్డర్, పెయింటర్ ట్రేడ్‌లలో కోర్సులు అందిస్తున్నట్లు తన ప్రకటనలో పేర్కొంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆగస్టు 28వ తేదీలోగా అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించింది. ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకొనే విద్యార్థులు మరింత సమాచారం కోసం 9100664452, 6302649844, 040-69400000 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు. ఈ మేరకు టీజీఎస్‌ఆర్టీసీ సూచనలు చేసింది. మెకానిక్ డీజిల్, వెల్డర్ కోర్సులు ఏడాది వ్యవధిలో పూర్తయ్యే కోర్సులు. ఇక మెకానిక్ (మోటర్ వెహికల్), పెయింట్ కోర్సులు రెండేళ్ల వ్యవధితో అందిస్తున్నారు. వెల్డర్, పెయింటర్ కోర్సులకు ఎనిమిదో తరగతి విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సులకు ఏడాదికి రూ.16,500 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలోని ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సు పరీక్షల ఫలితాలు మరో రెండు రోజుల్లో విడుదల కానున్నాయి. తొలుత ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల చేయనున్నారు. అనంతరం 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు భర్తీ చేస్తారు. అలాగే స్టాఫ్ నర్సు పోస్టుల మెరిట్ జాబితా కూడా విడుదల చేసి, 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసేందుకు వైద్య నియామక బోర్డు ఏర్పాట్లు చేస్తుంది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# షాంఘై సదస్సుకు హాజరుకానున్న మోడీ

## స్వాగతించిన చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి

న్యూఢిల్లీ,

ఆగస్టు చివరలో తియాంజిన్ వేదికగా జరగనున్న షాంఘై సహకార సదస్సు లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ వెళ్లనున్నారని వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించి షెడ్యూల్ ఖరారైనట్లు- తెలుస్తోంది. ఈ పరిణామాలపై స్పందించిన బీజింగ్.. ప్రధాని మోదీ పర్యటనను స్వాగతించింది. ఈ శిఖరాగ్ర సమావేశం సభ్యదేశాల మధ్య సంఘీభావం, స్నేహం, ఫలవంతమైన ఫలితాలకు వేదిక కానుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ద్వైపాక్షిక వార్షిక సదస్సులో భాగంగా ప్రధాని మోదీ ఆగస్టు 30న జపాన్‌లో పర్యటించనున్నారు. అనంతరం ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొనేందుకు చైనా వెళ్లనున్నారు. ఇదే విషయంపై చైనా విదేశాంగ అధికార ప్రతినిధి గువా జియాకున్ స్పందిస్తూ.. ఎస్‌సీవో సభ్యదేశాలు సహా 20 దేశాల నేతలు, 10 అంతర్జాతీయ సంస్థల అధిపతులు ఇందుకు హాజరుకానున్నారని చెప్పారు. అయితే, ప్రధాని జపాన్, చైనా పర్యటనలకు సంబంధించి అధికారికంగా ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన వెలువడలేదు. ప్రధాని మోదీ చైనాలో చివరిసారిగా 2018లో పర్యటించారు. అనంతరం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ 2019లో భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది రష్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ భేటీ- అయ్యారు. తాజాగా మోదీ షాంఘై సదస్సులో పాల్గొనడానికి వెళ్లనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.



## సంపాదకీయం...

# ట్రంపరితనంను ఎదురించాల్సిందే !

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హద్దుమీరి ప్రవర్తిస్తున్న తీరు మరోమారు ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఏ దేశం ఎవరితో దోస్తానా చేయాలో..ఎవరితో వాణిజ్యం చేయాలో అన్న ఆంక్షలు విధించే హక్కు ట్రంప్‌కు ఎక్కడిదని ప్రశ్నించాలి. ఈ విషయంలో మోడీ దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టాలి. ట్రంప్ ఆంక్షలను అంగీకరించేది లేదని గట్టిగానే చెప్పాలి. చర్చలు జరిపేది లేదంటున్న ట్రంప్‌తో మనం కూడా అంతే మొండి వైఖరితో ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో చెప్పగలగాలి. ఒకవైపు మనపై వాణిజ్య ఆంక్షలు విధిస్తూ..మరోవైపు పాక్‌ను దువ్వుతున్న తీరు అమెరికా ద్వంద్వ నీతిని తెలియ చేస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు తీవ్ర దుమారం రేపుతున్న వేళ ట్రంప్ ఏ మాత్రం తగ్గేది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో రెండు దేశాల మధ్య ఓ రకంగా విభేదాలు పొడసూపి నట్లుగానే భావించాలి. ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు భారత్‌కు పరీక్షగా మారాయి. ఈక్రమంలో మోడీ కూడా మనదేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటూనే ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను తమపై విధించడంతో భారత్ దీటుగా స్పందించింది.**

తమ దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాల ఉత్పత్తుల రంగంలోని వారి ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసింది. అవసరమైతే ఆ భారాన్ని తామే భరిస్తామని వెల్లడించింది. మరోవైపు భారత్‌పై మరిన్ని ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇక ఆయన విధించిన సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీనివల్ల అమెరికాలో కొన్నింటి ధరలు పెరగనున్నాయి. అయితే, అమెరికా అదనపు సుంకాల వల్ల రెండు దేశాల మధ్య తలెత్తిన వివాదం తాత్కాలికమేనని, త్వరలోనే సమసిపోతుందని ప్రవాస భారతీయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. చర్చలు ఫలించి త్వరలో ఒప్పందం కుదరనుందనే ఆశాభావం వ్యక్తం చేశాయి. 50 లక్షల మంది ప్రవాస భారతీయులు అమెరికా అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. భారతీయ ఉత్పత్తులపై 50శాతం సుంకాలను వేయడాన్ని ఇండియన్-అమెరికన్ల నేత, బైడెన్ మాజీ సలహాదారు అజయ్ భుటోరియా ఖండించారు. 'అమెరికాలో తక్కువ ధరలకు లభించే 50శాతం జనరిక్ మందులను భారత్ సరఫరా చేస్తోంది. ఈ సుంకాలు వాటి ధరలను పెంచుతాయి. దీనివల్ల అమెరికాలోని కుటుంబాలు, సీనియర్ సిటిజన్లు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడతారు. మసాలా దినుసులు, పప్పులు, దీపావళి దుస్తుల ధరలు పెరుగుతాయని పేర్కొన్నారు. దుస్తులు, పాదరక్షల ధరలు 37శాతం దాకా పెరగవచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఎలా ఉన్నా మనం కూడా తగ్గేదేలా లేదన్నట్లుగా వ్యవహ రించాలి. కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ ఇదే విషయాన్ని గుర్తుచేశారు.. ట్రంప్ విధించిన అదనపు సుంకాలపై ప్రధాని మోదీ గట్టిగా సమాధానమిచ్చారు. తమ రైతుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీ పడబోమని, దానికి ఎంత మూల్యమైనా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలే మాకు అత్యంత ముఖ్యం. రైతులు, మత్స్యకారులు, డెయిరీ ఉత్పత్తిదారుల ప్రయోజనాల విషయంలో భారత్ ఎప్పటికీ రాజీ పడబోదు. వారిని కాపాడటం కోసం సుంకాల భారాన్ని సొంతగా భరించడానికి సిద్ధం అని ప్రధాని స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొంటుందన్న కారణంతో భారత్‌పై 50శాతం సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో బాంబు పేల్చారు. తదుపరి మరిన్ని ఆంక్షలను చూస్తారంటూ హెచ్చరించారు. శ్వేతసౌధంలోని ఓవల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'భారత్‌పై మేం 50శాతం సుంకాలను విధించిన విషయం మీకు తెలుసు. ఆ దేశం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో రెండో స్థానంలో ఉంది. తొలిస్థానంలో ఉన్న చైనాకు అతి దగ్గరగా ఉంది. అందుకే భవిష్యత్తులో మరిన్ని ఆంక్షలను చూడబోతున్నారని పేర్కొన్నారు. ట్రంప్ తీరు చూస్తుంటే పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది. తన వైఖరిని నెగ్గించుకోవడమే ఆయనకు ముఖ్యంగా ఉంది. ఎలన్ మస్క్ లాంటి వారినే దూరం పెట్టిన ట్రంప్‌కు భారత్ ప్రయోజనాలు ముఖ్యం కాదు. ఇకపోతే ఆపరేషన్ సింధూర్ తరవాత భారత్ సైనికంగా బలపడడంతో కూడా ట్రంప్ తట్టుకోవడం లేదని తెలుస్తోంది. ఇది కూడా ట్రంప్ వైఖరికి కారణం కావచ్చని వశ్లేషిస్తున్నారు. భారత్‌పై గతంలో విధించిన 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. అదనంగా విధించిన మరో 25శాతం ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. మన దేశంతోపాటు అనేక దేశాలపై సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. దీనివల్ల బిలియన్ల కొద్దీ డాలర్లు అమెరికాకు వస్తాయని ట్రంప్ ప్రకటించారు. ఈ సుంకాలు 10శాతం నుంచి 50శాతం దాకా ఉన్నాయి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత గత పదకొండేళ్లుగా ఇలా ఎప్పుడూ జరగలేదు. అవినీతిరహితంగా పాలన సాగుతుందన్న పేరు వచ్చింది. అలాగే సాహసోపేత



నిర్ణయాలు కూడా తీసుకుని సత్తా చాటింది. అయోధ్య, కాశ్మీర్, ట్రిపుల్ తలాక్ విషాయల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సైనిక సత్తా చాటాం. పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పాం. ప్రపంచవ్యాప్తంగా భారత్చర్యలకు గట్టి మద్దతు లభించింది. మోడీ సర్కార్ సాహస నిర్ణయాలకు వెనకాడదని రుజువు చేసుకుంది. సర్జికల్ స్ట్రయిక్స్ తరవాత, ఆపరేషన్ సిందూర్తరవాత కూడా పాక్ వైఖరిలో మార్పు రాలేదు. దాయాది దేశాన్ని ప్రపంచంలో దోషిగా నిలబెట్టిన ఘనత మోడీదే అని చెప్పక తప్పదు. ట్రంప్ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో అని దేశం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో భారత్ తన సార్వభౌమాధికరం ముఖ్యమని చాటి చెప్పాలి.

## ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులను తిరిగి ప్రారంభించాలి

### పనులు ఆగిపోవడంతో ఎత్తిపోతలకు ఏటా రూ.750 కోట్లు

### అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష

హైదరాబాద్,

ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులను తిరిగి త్వరగా ప్రారంభించాలని అధికారులను రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిఆదేశించారు. అవసరమైన అనుమతులపై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ నిర్వహిస్తారని చెప్పారు. శుక్రవారం నీటిపారుదశాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మూడు దశాబ్దాల తర్వాత నీటిపారుదల శాఖలో పదోన్నతులు, బదిలీలు జరుగుతున్నట్లు- చెప్పారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం తర్వాత నిపుణుల కమిటీ సిఫార్సు లతో తిరిగి పనులు మొదలుపెట్టాలి. ముఖ్యమైన ప్రాజెక్టు 9 కి.మీ పనికే నిలిచిపోవడం దురదృష్టకరం అన్నారు. ఎస్‌ఎల్‌బీసీ పూర్తి కానందున ఎత్తిపోతలకు ఏటా రూ.750 కోట్లు- ఖర్చవుతోంది. అత్యాధునిక సాంకేతికతతో ముందుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్జీఆర్‌ఐ సర్వేతో భూగర్భం కి.మీ దిగువ వరకు మ్యాపింగ్ చేయొచ్చన్నారు. కచ్చితమైన ప్రణాళిక కోసం లైడార్ సర్వే కూడా చేస్తాం. నాణ్యతలో రాజీపడకుండా మంత్రివర్గం ఆమోదించిన అంచనాతో ప్రాజెక్టు పనులు చేపట్టాలని మంత్రి తెలిపారు. మరోవైపు ఎస్‌ఎల్‌బీసీ సొరంగానికి హెలికాప్టర్‌తో మాగ్నెటిక్ జియోఫిజికల్ సర్వేకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ.2.36 కోట్లతో నామినేషన్ పద్ధతిన ఎన్జీఆర్‌ఐకి పనులు అప్పగించింది. ఎస్‌ఎల్‌బిసి సొరంగంలో జరిగిన ప్రమాదం తర్వాత అక్కడ పనులు ఆగిపోయాయి. దీంతో ఆ పనులను పునః ప్రారంభించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సొరంగంలో ప్రమాదం తర్వాత నిపుణుల కమిటీ- సిఫార్సులతో పనులు తిరిగి మొదలు పెట్టాలని ఉత్తమ్ అన్నారు. ముఖ్యమైన ప్రాజెక్టు 9 కి.మి పనికే ఆగిపోవడం దురదృష్టకరం. ఎస్‌ఎల్‌బిసి పూర్తి కాకపోవడంతో ఎత్తిపోతలకు రూ.750 కోట్లు- ఖర్చవుతోంది. అందుకే అత్యాధునిక సాంకేతికతతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

## మెడిసిటీ కళాశాలలో గంజాయి కేసు

### విద్యార్థులు గంజాయి అమ్ముతున్నట్లు గుర్తింపు

మేడ్చల్,

వైద్య విద్యార్థులు కూడా గంజాయి మత్తులో పడ్డారు. ఏకంగా సీనియర్లు అమ్మడం, జూనియర్లు దానికి అలవాటు పడడం జరిగింది. మేడ్చల్ మెడిసిటీ- మెడికల్ కళాశాలలో గంజాయి కేసులో కొత్తకోణం బయటపడింది. మూడేళ్లుగా కాలేజీలో చదువుతున్న వైద్య విద్యార్థులు కూడా గంజాయిని విక్రయిస్తున్నట్లు- విచారణలో తేలిందని హైదరాబాద్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోలీస్ అధికారులు తెలిపారు. డ్రగ్స్‌పై ఈగల్ పోలీసులు నిర్వహిస్తున్న ఆపరేషన్‌లో మెడిసిటీ- వైద్య విద్యార్థులు గంజాయి తీసుకున్నట్లు- గురువారం పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ టెస్టులో గంజాయి పాజిటివ్ వచ్చిన పలువురు విద్యార్థుల్ని డీ-అడిక్షన్ సెంటర్‌కు పంపించారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన ఏఎన్‌బీ అధికారులకు మరిన్ని విషయాలు తెలిశాయి. సీనియర్ విద్యార్థులే జూనియర్లకు గంజాయి అలవాటు- చేశారని, వారే వాటిని విక్రయించినట్లు- గుర్తించారు. వైద్య విద్యార్థులకు గంజాయి విక్రయించిన డ్రగ్ పెడ్లర్ బొల్లారానికి చెందిన హరాఫత్ అలీఖాన్‌ను అరెస్టు చేసినట్లు- తెలిపారు. నిందితుడు అలీఖాన్ బీదర్‌కు చెందిన జరీనా బాను నుంచి గంజాయిని కొనుగోలు చేసి.. వైద్య విద్యార్థులకు అమ్ముతున్నట్లు- పోలీసులు చెప్పారు.

## ఎపిలో నలుగురు జడ్జిలకు పదోన్నతి

అమరావతి కేంద్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. పలు హైకోర్టుల్లో అదనపు న్యాయమూర్తులుగా పనిచేస్తున్న 16 మందిని పూర్తికాలం న్యాయమూర్తులుగా నియమిస్తూ.. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ సహా.. ఆరు రాష్ట్రాల్లో న్యాయమూర్తులకు పదోన్నతి ఇస్తూ.. కేంద్ర న్యాయశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా ఏపీ హైకోర్టులో నలుగురు అదనపు న్యాయమూర్తులకు పదోన్నతి లభించింది. జస్టిస్ హరనాథ్ నూనెపల్లి, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌లకు పూర్తి స్థాయి జడ్జిలుగా పదోన్నతి కల్పిస్తూ కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు వెలువరించింది. 16 మంది హైకోర్టు జడ్జిలకు పదోన్నతి కల్పించాల్సిందిగా సుప్రీం కోర్టు కొలీజియం ఇటీవల సిఫార్సు చేసింది. అందుకు రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో తాజాగా కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది.

## ట్రంప్ సుంకాల వడ్డింపు వేళ

### పుతిన్‌తో ప్రధాని మోడీ ఫోన్ సంభాషణ

### ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితిపై చర్చించట్లు ప్రకటన

న్యూఢిల్లీ,

ట్రంప్ సుంకాల బెదరింపుల వేళ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కు ప్రధాని మోదీ ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌కు సంబంధించి తాజా పరిస్థితులను ప్రధాని మోదీకి పుతిన్ వివరించినట్లు- తెలిసింది. ఈ సంక్షోభం ముగింపునకు శాంతియుత చర్చలే పరిష్కార మార్గమని భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసినట్లు- ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. భారత్-రష్యాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపైనా ఇరువురు నేతలు చర్చించారు. ఇరుదేశాల మధ్య ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ఇరువురు నేతలు తమ నిబద్ధతను చాటుకున్నట్లు- తెలిసింది. ఈ సందర్భంగా 23వ భారత్-రష్యా వార్షిక సదస్సులో భాగంగా ఈ ఏడాది చివరలో భారత్‌లో పర్యటించాలని పుతిన్‌కు ప్రధాని మోదీ ఆహ్వానించినట్లు- పీఎంవో వెల్లడించింది. అయితే, రష్యా నుంచి చమురు కొనుగోలు నేపథ్యంలో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు విధించిన వేళ ప్రధాని మోదీ పుతిన్‌తో సంభాషించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇకపోతే ఇదే అంశంపై చర్చించేందుకు పుతిన్‌తో భారత భద్రతా సలహాదారు అజిత్ దోబల్ ఇప్పటికే మాస్కోలో ఉన్నారు. ఆయన పుతిన్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాలకు సంబంధించిన తాజా పరిస్థితులను వారు చర్చించారు.

## సృష్టి కేసులో ఇద్దరు కెజిహెచ్ డాక్టర్లు

### తవ్వినకొద్దీ బయట పడుతున్న అక్రమాలు

హైదరాబాద్,

'సృష్టి' ఫెర్టిలిటీకేసులో విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ (కేజీహెచ్)కు చెందిన ఇద్దరు వైద్యులను గోపాలపురం పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ వాసుపల్లి రవి కుమార్, ప్రసూతి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉషాదేవి ఉన్నారు. ఇక వాసుపల్లి రవి కుమార్ మాజీ ఎమ్మెల్యే తమ్ముడు కావడంతో ఈ కేసులో మరో రాజకీయ కోణాన్ని తీసుక రాబోతుంది. ఇదివరకు ఇదే కేసులో అరెస్టయి, బెయిల్ పై విడుదలైన డాక్టర్ విద్యుల్లత కూడా కేజీహెచ్ పిల్లల విభాగంలో పనిచేశారు. ఈ వైద్యులు కేజీహెచ్‌లో విధులు నిర్వహిస్తూనే 'సృష్టి' ఫెర్టిలిటీ- ఆసుపత్రిలో వైద్య సేవలు అందించేవారని ఆరోపణలు ఉన్నాయి. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఈ అరెస్టులపై తనకు వివరాలు తెలియవని తెలిపారు. డాక్టర్ వాసుపల్లి రవి కుమార్ గత మూడు రోజులుగా సెలవులో ఉన్నట్లు- సమాచారం. మరో వైపు, ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతతో సంబంధాలు కలిగి ఉన్న ఇద్దరు వైద్యులు డాక్టర్ రమ్య, డాక్టర్ రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఇప్పటివరకు ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 28కి చేరింది. దర్యాప్తులో బయటపడ్డ వివరాల ప్రకారం, సరోగసి పేరుతో డాక్టర్ నమ్రత ఇప్పటి వరకు సుమారు 50 మంది బాధితుల వద్ద నుంచి రూ.20 కోట్లకు పైగా వసూలు చేశారు. మరో కీలక నిందితురాలు సంతోషి ఏజెంట్ల ద్వారా 18 మంది శిశువులను సేకరించినట్లు- తేలింది. ముఖ్యంగా గిరిజన మహిళలను ప్రలోభపెట్టి వారి నుంచి శిశువులను కొనుగోలు చేసి, తమ క్లయింట్లకు ఒక్కో శిశువును రూ.50 లక్షలకు విక్రయించినట్లు- వెల్లడైంది. మొత్తం 80 మంది పిల్లలను అమ్మిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు డాక్టర్ నమ్రత బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. తల్లులను గుర్తించి శిశువులను తిరిగి వారికి అప్పగించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు- చేస్తున్నారు.

### తిరుపతిలో ఆటో డ్రైవర్ దాష్టీకం

తిరుమల, తిరుపతి రైల్వే స్టేషన్‌లో భక్తుడిపై ఆటో డ్రైవర్లు దాడికి దిగిన ఘటన భక్తుల్లో భయాందోళనలకు కారణమైంది. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకన్నను దర్శించుకోవడానికి వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి భక్తులు తిరుమలకు వెళుతుంటారు. అలాంటి భక్తులపై శ్రీనివాస మంగాపురం, శ్రీవారి మెట్టుకు వెళ్లే ఫ్రీ బస్ స్టాప్ వద్ద ఆటోడ్రైవర్లు దాడికి దిగారు. దాడికి సంబంధించిన వీడియోని కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఆటో డ్రైవర్ చెప్పిన రేటుకు భక్తుడు నిరాకరించడంతో అతడిపై తీవ్రంగా దాడి చేసి ఆటో డ్రైవర్లు గాయపరిచారు. తిరుపతి రైల్వే స్టేషన్ దగ్గర ఆటోవాలాల దందా రోజురోజుకు పెరిగిపోతుండటం గమనార్హం. తిరుపతి బస్టాండ్, రైల్వే స్టేషన్ల దగ్గర నుంచి శ్రీవారి మెట్టు- వరకు తిరుమల తిరుపతి దేవస్థానం భక్తుల కోసం ఉచిత బస్సులు ఏర్పాటు- చేసింది. అయితే సమాచార లోపం కారణంగా భక్తుల్లో గందరగోళం నెలకొంది. ఉచిత బస్సుల -టైమింగ్ భక్తులకు తెలియకపోవడంతో శ్రీవారి మెట్టు- వరకు భక్తులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ఆటోవాలాలు భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

స్పోర్ట్స్



# అత్యాచారం కేసులో చిక్కుకున్న క్రికెటర్ హైదర్ అలీ

పాకిస్తానీ క్రికెటర్ హైదర్ అలీని అత్యాచారం కేసులో భాగంగా గ్రేటర్ మాంచెస్టర్ పోలీసులు అరెస్టు చేశారు. అతను పాకిస్తాన్ ఎ జట్టుతో కలిసి ఇంగ్లాండ్ పర్యటనలో ఇంగ్లాండ్ లయన్స్‌తో ఆడటానికి వెళ్ళాడు. మాంచెస్టర్ పోలీసులు ఇమెయిల్ ద్వారా, "సోమవారం, ఆగస్టు 4, 2025న అత్యాచారం గురించి ఫిర్యాదు అందిన తర్వాత, మేము 24 ఏళ్ల వ్యక్తిని అరెస్టు చేశాము" అని తెలిపారు. పాకిస్తానీ క్రికెటర్ హైదర్ అలీ 2 అక్టోబర్ 2000న పాకిస్తాన్ పంజాబ్‌లో జన్మించాడు. 24 ఏళ్ల ఈ క్రికెటర్ పాకిస్తాన్ తరపున వన్డే, టీ20లలో అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు, అతను భారత్‌తో జరిగిన ప్రపంచ కప్‌లో మ్యాచ్ ఆడాడు. అతనికి ఆటలో




రోహిత్ శర్మ ఆదర్శమని చెబుతుంటాడు. అతను పీఎస్‌ఎల్ లో ఇస్లామాబాద్ యునైటెడ్ తరపున ఆడతాడు. 2023లో ఇంగ్లాండ్ కౌంటీ క్లబ్ డెర్బీషైర్‌లో ఆడాడు. హైదర్ అలీ 2 అక్టోబర్ 2000న పాకిస్తాన్ పంజాబ్‌లోని అటాక్‌లో జన్మించాడు, అతని తండ్రి భూస్వామి. అతని సోదరుడు రావల్పిండి రామ్స్ తరఫున ఆడాడు. 2015లో హైదర్ టేప్ బాల్ క్రికెట్‌తో తన క్రికెట్ కెరీర్‌ను ప్రారంభించాడు, కొన్ని నెలల తర్వాత అతను అల్ ఫైసల్ క్రికెట్ క్లబ్‌లో చేరాడు. హైదర్ అలీ సెప్టెంబర్ 2019లో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోకి ప్రవేశించాడు. తర్వాత ఏడాది అంటే సెప్టెంబర్ 1, 2020న అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. వికీపీడియా ప్రకారం, అలీ భారతీయ క్రికెటర్ రోహిత్ శర్మను తన ఆదర్శంగా తీసుకుంటాడని తెలుస్తోంది. హైదర్ అలీ 35 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లలో భారత్‌తో కేవలం ఒకే మ్యాచ్ ఆడాడు, అది కూడా ప్రపంచ కప్‌లో. అతను 23 అక్టోబర్ 2022న మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన టీ20 ప్రపంచ కప్‌లో భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌లో ఆడాడు. అయితే, అతను అందులో సరిగా ఫెర్ఫార్మ్‌చేయలేకపోయాడు. అతను కేవలం 2 పరుగులు చేసి హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. ఈ మ్యాచ్‌లో భారత్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ విరాట్ కోహ్లీ 82 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అలీ నవంబర్ 1, 2020న జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో తన వన్డే అరంగేట్రం చేశాడు. దీనికి ముందు, సెప్టెంబర్ 1, 2020న, అతను ఇంగ్లాండ్‌తో మాంచెస్టర్‌లో టీ20 అరంగేట్రం చేశాడు. అతను 2023లో చివరిసారిగా అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు, అయితే అతను త్వరలో జాతీయ జట్టులోకి తిరిగి వస్తాడని భావించారు, కాని అంతకు ముందే అత్యాచారం ఆరోపణలు వచ్చాయి. దీని తరువాత, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు విచారణ పూర్తయ్యే వరకు అతన్ని సస్పెండ్ చేసింది. హైదర్ అలీ 2 వన్డే మ్యాచ్‌లలో మొత్తం 42 పరుగులు చేశాడు. 35 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 32 ఇన్నింగ్స్‌లలో అలీ 124.69 స్ట్రైక్ రేట్‌తో 505 పరుగులు చేశాడు, ఇందులో 3 అర్ధ సెంచరీలు ఉన్నాయి.




# టెస్టు ర్యాంకింగ్స్ లో దిగజారిన గిల్ ర్యాంకు!?

ఇంగ్లాండ్ తో జరిగిన అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో భారత టెస్టు కెప్టెన్ శుభమాన్ గిల్ విశేషంగా రాణించిన సంగతి తెలిసిందే. ఇంగ్లాండ్ గడ్డపై రాణించలేడని, అతని అత్యధిక స్కోరు కేవలం 30 మాత్రమే అని ఎద్దేవా చేసిన వారికి, తన బ్యాటింగ్ తో సమాధానమిచ్చాడు. ఈ సిరీస్ లో నాలుగు సెంచరీలతోపాటు 754 పరుగులు సాధించి, సిరీస్ లీడింగ్ రన్ స్కోరర్ గా నిలిచాడు. అలాగే ఒక టెస్టు సిరీస్ లో అత్యధిక పరుగులు చేసిన టీమిండియా కెప్టెన్ గా కూడా గిల్ రికార్డులకెక్కాడు. అయినప్పటికీ, ఇటీవల ప్రకటించిన ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ లో తన ర్యాంకు దిగజారింది. ఏకంగా నాలుగు స్థానాలు కోల్పోయాడు. ఇందుకు గల కారణం..




అతను ఐదో టెస్టులో విఫలం కావడమేనని తెలుస్తోంది. ఈ టెస్టులో కేవలం 32 రన్స్ మాత్రమే చేసిన గిల్ ఏకంగా టాప్-9 నుంచి 13కి పడి పోయాడు. అయినా కూడా ఈ మ్యాచ్ లో



ఇండియా ఆరు పరుగులతో థ్రిల్లింగ్ విక్టరీ నమోదు చేసి, సిరీస్ ను 2-2తో సమం చేసింది. ఇక ఈ సిరీస్ లోనే ఐదు టెస్టులు ఆడిన ఏకైక భారత పేసర్ గా నిలిచిన మహ్మద్ సిరాజ్.. లీడింగ్ వికెట్ టేకర్ గా నిలిచాడు. ఆఖరి టెస్టులో ఒక ఫైఫర్ తో సహా తొమ్మిది వికెట్లు తీశాడు. దీంతో తన కెరీర్ బెస్ట్ ర్యాంకుకు చేరుకున్నాడు. తాజాగా ప్రకటించిన ర్యాంకుల్లో 15వ ర్యాంకును దక్కించుకున్నాడు. అదే టెస్టులో విశేషంగా రాణించిన మరో పేసర్ ప్రసిధ్ కృష్ణ కూడా తన కెరీర్ బెస్టు ర్యాంకును దక్కించుకున్నాడు. తను 59వ ర్యాంకును దక్కించుకున్నాడు. ఇక ఈ సిరీస్ లో ఐదో టెస్టులో ఆడిన గస్ అట్కిన్సన్ టాప్ -10 బౌలర్ల జాబితాలో చోటు దక్కించుకోగా, ఇంగ్లీష్ లీడింగ్ వికెట్ టేకర్ జోష్ టంగ్ కూడా కెరీర్ బెస్టు ర్యాంకును దక్కించుకున్నాడు. మరోవైపు ఐదో టెస్టులో సెంచరీతో దుమ్ము రేపిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్



కెరీర్ బెస్టు ర్యాంకును దక్కించుకన్నాడు. ఈ సిరీస్ లో తొలి టెస్టులో శతకం బాదిన ఈ యువ ఓపెనర్.. ఆ తర్వాత కీలకమైన ఐదోటెస్టు రెండో ఇన్నింగ్స్ లోనూ సెంచరీని బాదాడు. నిజానికి ఈ టెస్టులో టాప్ స్కోరర్ తనే. ఈక్రమంలో అటు ఆస్ట్రేలియా, ఇటు ఇంగ్లాండ్ లోనూ ఆడిన తొలి టెస్టులోనే సెంచరీ చేసిన భారత క్రికెటర్ గా గుర్తింపు పొందాడు. ఇప్పుడీ టాప్-5 ర్యాంకుతో తనలో మరింతగా ఆత్మవిశ్వాసం పొందిందనడలో సందేహం లేదు. జో రూట్, హేరీ బ్రూక్ వరుసగా తొలి రెండు స్థానాలలో కొనసాగుతున్నారు.

# సిరాజ్ గాయపడకుండా కాపాడుకోవాలి

## టీమిండియా మాజీ పేసర్ ఆర్పీ సింగ్

ఇంగ్లాండ్‌తో జరిగిన 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో టీమిండియా అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ అద్భుతంగా రాణించి అభిమానుల హృదయాలను గెలుచుకున్నాడు. ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్‌ను నిలువరించి.. బుమ్రా లేకపోయినా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఈ టెస్ట్ సిరీస్‌లో మహ్మద్ సిరాజ్ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్. ఇప్పుడు టెస్ట్ సిరీస్ ముగిసిన తర్వాత, భారత మాజీ ఆటగాడు మహ్మద్ సిరాజ్ గురించి పెద్ద ప్రకటన చేశాడు. మహ్మద్ సిరాజ్ గాయపడకుండా కాపాడాలని టీమిండియా మాజీ పేసర్ ఆర్పీ సింగ్ టీమిండియా మేనేజ్‌మెంట్‌ను హెచ్చరించాడు. ఆర్పీ సింగ్ మాట్లాడుతూ.. ఫాస్ట్ బౌలర్లకు గాయాలు కావడం చాలా పెద్ద ప్రమాదం అని అన్నాడు. ఎందుకంటే వారు చాలా తక్కువ సమయంలో చాలా మ్యాచ్‌లు ఆడారు. బుమ్రా వర్క్‌లోడ్‌ను మ్యానేజ్ చేసినట్లే, సిరాజ్ వర్క్‌లోడ్‌ను కూడా మ్యానేజ్ చేయాలి. సిరాజ్ కూడా ఇప్పుడు బుమ్రా లీగ్‌లోకి వచ్చాడు. అతను గాయపడకుండా కాపాడుకోవాలి. మనం అతని పనిభారాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఇంగ్లాండ్‌తో జరిగిన 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో అతను నిజంగా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన 5 టెస్ట్ మ్యాచ్‌ల్లో మొహమ్మద్ సిరాజ్ 23 వికెట్లు పడగొట్టాడు. ఈ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. తొలిసారిగా మొహమ్మద్ సిరాజ్ ఒక టెస్ట్ సిరీస్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టాడు. జస్ప్రీత్ బుమ్రా గురించి మాట్లాడుతూ ఈ టెస్ట్ సిరీస్ ప్రారంభానికి ముందు, భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ జస్ప్రీత్ బుమ్రా పూర్తిగా ఫిట్‌గా లేనందున మూడు టెస్ట్‌లలో మాత్రమే పాల్గొంటారని ధృవీకరించారు. అతను మొదటి, మూడవ, నాల్గవ టెస్ట్ మ్యాచ్‌లలో పాల్గొన్నాడు. ఐదవ టెస్ట్ మ్యాచ్‌లో మొహమ్మద్ సిరాజ్ మొత్తం 9 వికెట్లు పడగొట్టాడు. దీని కారణంగా ఇంగ్లాండ్, భారత్ మధ్య టెస్ట్ సిరీస్ 2-2తో డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్ గెలవడానికి ఇంగ్లాండ్ 374 పరుగులు అవసరమైన టైమ్‌లో వారు 367 పరుగులు మాత్రమే చేయగలిగారు. మొహమ్మద్ సిరాజ్ ఆటతీరును చాలా మంది అభిమానులు, క్రికెట్ నిపుణులు ప్రశంసించారు.



# గాయంతో ఆసియా కప్ కు రిషబ్ పంత్ దూరం

ఆసియా కప్ 2025 మొదలవడానికి కేవలం ఒక నెల మాత్రమే సమయం ఉంది. ఈ లోగా క్రికెట్ అభిమానులకు షాకింగ్ న్యూస్. సెప్టెంబర్ 9 నుంచి యూఏఈలో ఈ టోర్నీ ప్రారంభం కానుంది. వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్ రిషభ్ పంత్ గాయం కారణంగా ఆసియా కప్ నుంచి తప్పుకుంటున్నారని సమాచారం. ఆసియా కప్ మాత్రమే కాకుండా, దీని తర్వాత వెస్టిండీస్‌తో జరిగే సిరీస్‌కు కూడా ఆయన అందుబాటులో ఉండరని తెలుస్తోంది. ఇంగ్లాండ్‌తో జరిగిన నాలుగో టెస్టులో పంత్‌కు ఈ గాయం అయింది. ఆ మ్యాచ్‌లో గాయంతోనే బ్యాటింగ్ చేసి హాఫ్ సెంచరీ సాధించినా, చివరి టెస్టుకు ఆయన దూరమయ్యారు. టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం, పంత్ ఆసియా కప్‌కు దూరంగా ఉండనున్నారు. ఇంగ్లాండ్‌తో జరిగిన నాలుగో టెస్టులో క్రిస్ వోక్స్ వేసిన ఒక బంతి రిషభ్ పంత్ కుడి కాలి బొటనవేలికి బలంగా తగిలింది. రివర్స్ షాట్ ఆడబోయినప్పుడు ఈ గాయం జరిగింది. గాయం తర్వాత పంత్ మైదానాన్ని వీడారు. స్కానింగ్‌లో ఆయన బొటనవేలికి ఫ్రాక్చర్ అయినట్లు తేలింది. అయినప్పటికీ, ధైర్యంగా బ్యాటింగ్‌కు వచ్చి కీలకమైన హాఫ్ సెంచరీ సాధించారు. దీని తర్వాత ఐదో టెస్టుకు ఆయన దూరమయ్యారు. వైద్య నిపుణుల ప్రకారం.. పంత్ కోలుకోవడానికి దాదాపు 6 వారాల సమయం పడుతుంది. ఈ కారణంగానే సెప్టెంబర్‌లో జరిగే ఏషియా కప్‌కు ఆయన అందుబాటులో ఉండరని తెలుస్తోంది. అక్టోబర్ 2 నుంచి మొదలయ్యే వెస్టిండీస్‌తో జరిగే టెస్టు సిరీస్‌లో కూడా పంత్ ఆడటం కష్టం అని రిపోర్ట్స్ చెబుతున్నాయి. రిషభ్ పంత్ ఆస్ట్రేలియా పర్యటనతో తిరిగి జట్టులోకి వచ్చే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఒకవేళ ఆ పర్యటనకు కూడా పంత్ అందుబాటులో లేకపోతే, దాని తర్వాత భారత్‌కు వచ్చే దక్షిణాఫ్రికా జట్టుతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో ఆయన తిరిగి మైదానంలోకి వచ్చే అవకాశం ఉంది.



# పిడుగుపాటుకు ఎత్తిపోతల పైపులైన్ దిమ్మెలు నేలమట్టం

నాగర్‌కర్నూల్,

కొల్లాపూర్ నియోజకవర్గం, పెంట్లవెల్లి మండల పరిధిలోని మెరుపులు ఉరుములతో కూడిన వర్షానికి పిడుగు పడింది. పిడుగుపాటుకు ఎంగంపల్లి తండా గ్రామ సమీపంలో కృష్ణానది తీరాన నిర్మించిన ఎత్తిపోతల పథకం పైపులైన్ దిమ్మెలు నేలమట్టం అయ్యాయి. ఈ మినీ ఎత్తిపోతల పథకాన్ని 1994లో నిర్మించారు. దీని ద్వారా ఎంగంపల్లి తండా మల్లేశ్వరం మంచాలకట్ట కొన్ని గ్రామాలకు దాదాపుగా 650 ఎకరాలకు సాగునీరు సరఫరా జరిగేది. ఎత్తిపోతల పథకం నిర్మించిన మొదలు కొన్నేళ్లపాటు- ఉపయోగంలో ఉన్నా చాలాకాలం నుంచి మోటార్లు రిపేరు అయ్యాయనే నెపంతో నిరుపయోగంగా మారి శిథిలావ్యవస్థకు చేరింది. దీనిని మరమ్మతులు చేపట్టి, మళ్లీ ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు ఎంతో కాలం నుంచి కోరుతునన్నారు. కృష్ణానది చెంతన ఉన్న సాగుకు నీరు అందక రైతులు మాజీ ఎంఎల్‌లకు, ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావుకి వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ఎత్తిపోతలపై రైతన్నలు ఆశలు వదులుకున్నారు.

# మహిళలకు సిఎం రేవంత్ రాఖీ శుభాకాంక్షలు

హైదరాబాద్,

: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. మహిళల సాధికారతతో పాటు- మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తోందని అన్నారు. గృహజ్యోతి, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరా క్యాంటీ-న్లు,ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ మహిళలకే పెద్దపీట వేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళలందరూ భాగస్వాములయ్యే వరకు ప్రజా ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్నారు. మహిళల రక్షణ, భద్రత విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని, మహిళల అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని అన్నారు. అక్కా చెల్లెళ్లందరికీ తమ ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, అందరి దీవెనలతో విజయవంతంగా ప్రజా పాలన సాగిస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

# భారీవర్షాలతో ఇక్కట్లు

## అప్రమత్తంగా ఉండాలి సిఎం ఆదేశం పొంగిప్రవహిస్తున్న మూసీ నది ఈదులవాగులో కొట్టుకు పోతున్న కారును కాపాడిన స్థానికులు



హైదరాబాద్,

హైదరాబాద్ నగరంలో వర్షాలతో తలెత్తుతున్న ఇబ్బందులు, వరద సమస్యకు శాశ్వత పరిష్కారంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడా ప్రాణ నష్టం లేకుండా చూడాలన్నారు. సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి,సెక్రటరీ ఇలంబర్తి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, ఈవీ నర్సింహ రెడ్డి, జేఎండీ పి.గౌతమి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. వలిగొండ మండలం సంగెం సమీపంలోని భీమలింగం వద్ద లోలెవల్ బ్రిడ్జి పై నుంచి మూసీ ప్రవాహం కొనసాగుతోంది. వరద ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉండటంతో వంతనపై ఎవరూ ప్రయాణించకుండా పోలీసులు బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు- చేశారు. దీంతో సంగెం పరిసర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. బీబీనగర్ మండలం రుద్రవెల్లి వద్ద బ్రిడ్జి కింద నుంచి మూసీ ప్రవహిస్తోంది. రంగారెడ్డి, హైదరాబాద్. యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురవడంతో మూసీ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. చౌటుప్పల్ మండలంలో ఈదుల వాగు పొంగి ప్రవహించడంతో కారు కొట్టుకుపోయింది. స్థానికులు గమనించి ఏడుగురిని స్థానికులు కాపాడారు. కారు ఈదుల వాగు నుంచి వెళ్తుండగా ఒక్కసారిగా వరదలో కొట్టుకుపోయింది. స్థానికులు తాడు వేసి ఏడుగురిని బయటకు లాగారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. యాదాద్రి భువనగిరి జిల్లా సంగం భీమలింగం దగ్గర మూసీ లెవెల్ వంతెన పైనుంచి ప్రవహిస్తుంది. మూసీ నది వంతెనపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు. హిమాయత్ సాగర్ రిజర్వాయర్ నీటి మట్టం పూర్తిస్థాయికి పెరగడంతో నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని అధికారులు విడుదల చేశారు. దీంతో మూసీ ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో పరీవాహక ప్రజలకు అధికారుల హెచ్చరికలు జారీ చేశారు. హుస్సేన్ సాగర్ కూడా పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరింది.

# లిక్కర్ కేసులో జగన్ అరెస్ట్ ఖాయం

## ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలు

రాజమండ్రి,

లిక్కర్ కుంభకోణంలో జగన్ అరెస్ట్ ఖాయమని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో పెట్టుబడులు రాకూడదని జగన్ ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ తానే అధికారంలోకి వస్తానన్న భ్రమలో జగన్ ఉన్నారని ఎద్దేవా చేశారు. జగన్ ఎప్పుడు అరెస్టు అవుతారో డేట్ చెప్పలేమని, అరెస్ట్ మాత్రం ఖాయమని తెలిపారు.గత 78 ఏళ్లలో ఎప్పుడులేని విధంగా కేంద్ర ప్రభుత్వం ఏపీకి పూర్తి సహకారం అందిస్తుందని బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం హయాంలో ఏపీ అభివృద్ధి పథంలో ముందుకెళు తుందని అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలు తనను ఓడించినందుకు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కాకూడదనే మనస్తత్వంతో మాజీ సీఎం జగన్ ఉన్నారని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆరోపించారు. లిక్కర్ కేసు నిందితులు బిగ్‌బాస్ ఎవరో చెప్పినట్లు-గా సిట్ వద్ద వీడియో ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. అప్పట్లో చంద్రబాబుని ఎలాంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేశారని గుర్తు చేశారు. వైసీపీ మునిగిపోయే నావ, అందుకే ఆ పార్టీ కార్యక్రమాల్లో సీనియర్ నేతలు పాల్గొనడం లేదని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

# ఆసియాకప్ లో పలువురు ఆటగాళ్లు ఆడటంపై సందిగ్ధత!?

ఇటీవల ఇంగ్లాండ్ తో జరిగిన ఐదు టెస్టుల అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో భారత్ అద్భుతమైన పోరాట పటిమ ప్రదర్శించిన సంగతి తెలిసిందే. 2-2తో సిరీస్ సమం చేయడంతోపాటు సిరీస్ లో తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఓవరాల్ గా 33 సెషన్లలో భారత్ ఆధిక్యం దక్కించుకోగా. ఇంగ్లాండ్ కేవలం 21 సెషన్లకే పరిమితమైంది. మరో 18 సెషన్లలో ఇరుజట్లు ఉమ్మడిగా ఆధిక్యంలో నిలిచాయి. అయితే ఈ సిరీస్ లో విశేషంగా రాణించిన కొంతమంది భారత స్టార్లు వచ్చే నెల నుంచి జరగబోయే ఆసియాకప్ లో ఆడటం లేదు. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ లో భాగంగా ఇంగ్లాండ్ పై 3 టెస్టులు మాత్రమే ఆడిన బుమ్రా.. 14 వికెట్లతో రాణించాడు. తనను మెయిన్ గా టెస్టులకు, అదికూడా ముఖ్యమైన సిరీస్ లలోనే ఆడిస్తుండటంతో టీ20 ఫార్మాట్ లో జరుగుతున్న ఆసియాకప్ కు తను దూరమయ్యే అవకాశముంది. హెడ్ కోచ్ గా గౌతం గంభీర్ శకం మొదలయ్యాక, టీ20లలో యువరక్తంతో ఉరకలెత్తుతోంది. ఈ క్రమంలో భారత టెస్టు కెప్టెన్ శుభమాన్ గిల్ కు ఓపెనింగ్ పొజిషన్ లో చోటు దక్కడం లేదు. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ కుదురుకోవడంతో ఫస్ట్ చాయిస్ ఓపెనర్లుగా వారినే ఆడిస్తున్నారు. కాస్త స్లోగా ఆడే గిల్.. టీ20 ప్రణాళికల్లో ప్రస్తుతానికి లేడు. అలాగే దులీప్ ట్రోఫీలో నార్త్ జోన్ కు తను కెప్టెన్ గా ఎన్నికవడంతో ఆసియాకప్ నుంచి తను తప్పుకోక తప్పదు. తను కూడా ఓపెనర్ కాబట్టి, ప్రస్తుతానికి ఓపెనింగ్ పొజిషన్ లో ఖాళీ లేకపోవడంతో తను ఆసియా కప్ లో ఆడలేడు. అలాగే తను వెస్ట్ జోన్ కు ఎంపికవడంతోపాటు దులీప్ ట్రోఫీలో ఆడటంతో జైస్వాల్ ఆసియా కప్ ను మిస్సవ్వక తప్పదు. 2022 ప్రపంచకప్ తర్వాత టీ20 జట్టులో రాహుల్ అంతగా ఆడటం లేదు. ఫస్ట్ చాయిస్ వికెట్ కీపర్ గా సంజూ శాంసన్ ఆడుతుండటంతో తనకు చాన్స్ దొరకడం లేదు. అలాగే రిజర్వ్ లుగా ధ్రువ్ జురెల్, జితేశ్ శర్మ ఉండటంతోపాటు వయసు పైబడటం కూడా రాహుల్ ను ఈ ఫార్మాట్ కు దూరం చేస్తోంది. అయితే ఐపీఎల్లో తను ఈ ఏడాది 500ంకుపైగా పరుగులు సాధించాడు. ఇంగ్లాండ్



పర్యటనలో పాదం గాయంతో ఐదో టెస్టుకు దూరమైన వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ .. ఆసియా కప్ కు కూడా దూరమవడం ఖాయం. అయితే గత కొంతకాలంగా తను టీ20 ప్రణాళికల్లో లేడు. ఫస్ట్ చాయిస్ వికెట్ కీపర్ గా సంజూ ఉండటంతో పంత్ కు చాన్స్ దక్కడం లేదు. అయితే టెస్టుల్లో మాత్రం పంతే ఫస్ట్ చాయిస్ వికెట్ కీపర్ గా ఉన్నాడు. ఇక ఈ ఏడాది ఐపీఎల్లో పేలవ ఫామ్ రిత్యా, కొంతకాలంపాటు టీ20ల్లో జాతీయ జట్టు తరపున చోటు దక్కక పోవచ్చు.



# జడేజా నిలకడైన బ్యాటర్..

## ఇంగ్లండ్ గడ్డపై అత్యంత నిలకడగా రాణించాడు

## జడేజాపై మాజీ క్రికెటర్ అజయ్ జడేజా ప్రశంసల జల్లు

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాపై మాజీ క్రికెటర్ అజయ్ జడేజా ప్రశంసల జల్లు కురిపించాడు. ఇంగ్లండ్ గడ్డపై అత్యంత నిలకడగా రాణించిన బ్యాటర్ అని కొనియాడాడు. ఐదు టెస్టల అండర్సన్-సచిన్ ట్రోఫీలో రవీంద్ర జడేజా 10 ఇన్నింగ్స్‌ల్లో 86 సగటుతో 516 పరుగులతో రాణించాడు. ఇందులో ఐదు హాఫ్ సెంచరీలతో పాటు ఓ శతకం ఉంది. మరోవైపు



శుభ్‌మన్ గిల్ 754 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఓ టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన తొలి భారత కెప్టెన్‌గా చరిత్రకెక్కాడు. దాంతో ఈ సిరీస్ 2-2తో సమమైంది. తాజాగా ఈ సిరీస్ గురించి మాట్లాడిన అజయ్ జడేజా.. శుభ్‌మన్ గిల్ కంటే రవీంద్ర జడేజా మెరుగ్గా, నిలకడగా రాణించాడని కొనియాడాడు. ' రవీంద్ర జడేజా గురించి ఏం చెప్పాలి? అతను ఏం చేయగలడో అది చేశాడు. అద్భుత ప్రదర్శన కనబర్చాడు. శుభ్‌మన్ గిల్ 754 పరుగులు చేశాడు. అతను అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడని అందరూ కొనియాడుతున్నారు.జడేజా 500 ప్లస్ రన్స్ చేశాడు. కానీ శుభ్‌మన్ గిల్ కంటే నిలకడగా రాణించాడు. అతను నాలుగు ఇన్నింగ్స్‌ల్లో ఔట్ అవ్వలేదు. మరో ఎండ్‌లో అతనికి సహకారం లభించలేదు. కేవలం రెండు ఇన్నింగ్స్‌ల్లో మాత్రమే త్వరగా ఔటయ్యాడు. రవీంద్ర జడేజా ప్రదర్శనతోనే టీమిండియా ఈ సిరీస్‌ను సమం చేసుకుంది. లార్డ్స్ టెస్ట్‌లోనూ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. ఆఖరి టెస్ట్‌లో మెరుగ్గా ఆడాడు.'అని అజయ్ జడేజా చెప్పుకొచ్చాడు.



# గ్యాస్ సిలిండర్ పేలుడు కుటుంబాలకు పరిహారం

విశాఖపట్టణం,

విశాఖ గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. విశాఖ ఫిషింగ్ హార్బర్ సమీపంలోని ఓ వెల్డింగ్ దుకాణంలో గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురు కొన ఊపిరితో ఆసుపత్రిలో కొట్టు-మిట్టాడుతున్నారు.

# చౌకబారు విమర్శలపై క్షమాపణలు చెప్పాలి

## బండి సంజయ్‌కు కెటిఆర్ హెచ్చరిక

హైదరాబాద్,

ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల్లో నిజం ఉంటే నిరూపించాలని సంజయ్‌కు సవాల్ విసిరారు. లేదంటే 48 గంటల్లో వ్యాఖ్యలు ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే లీగల్ నోటీ-సులు పంపుతానని హెచ్చరించారు.ఇంటెలిజెన్స్ విభాగంపై ఆయనకు కనీస పరిజ్ఞానం లేదని, కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా పని చేస్తున్నప్పటికీ.. ఆయనకు ఆ మాత్రం పరిజ్ఞానం లేకపోవడం విచారకరమని అన్నారు. ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ.. ఇంటెలిజెన్స్ విభాగం ఎలా పని చేస్తుందో సంజయ్ అర్థం చేసుకోలేరు. నిర్లక్ష్యంతో ఆయన చేసిన ప్రకటనలు హద్దు మీరాయి. చౌకబారు ఆరోపణలతో ఆయన మరింత దిగజారారు. రాజకీయ ఉనికి కోసం రోడ్లపై చౌకబారు నాటకాన్ని ఎంచుకున్నారని విమర్శించారు.

# 10న బిజెపిలో చేరుతున్నా: గువ్వల

హైదరాబాద్,ఆ భాజపా సిద్ధాంతం, లక్ష్యం నచ్చే ఆ పార్టీలో చేరనున్నట్లు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెలిపారు. భాజపా రాష్ట్ర కార్యాలయానికి వెళ్లిన ఆయన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో భేటీ- అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 10న భాజపా రాష్ట్ర చీఫ్ రామచందర్‌రావు సమక్షంలో తాను ఒక్కడినే ఆ పార్టీలో చేరుతానని చెప్పారు. అచ్చంపేటలో ఎవరు ఎన్ని సభలు, సమావేశాలు పెట్టుకున్న తనని ఏమీ చేయలేరని వ్యాఖ్యానించారు. బీజేపీలో గువ్వల చేరికను రాంచందర్ రావు అధికారికంగా ప్రకటించారు. గువ్వల ఈనెల 10వ తేదీన కమలం పార్టీలో చేరనున్నారు. ఆయనతోపాటు- మరికొంతమంది బీఆర్ఎస్ నాయకులు కూడా బీజేపీలో చేరే అవకాశం కనిపిస్తోంది. బీఆర్ఎస్‌ను గువ్వల బాలరాజు వీడిన తర్వాత ఆ పార్టీపై సంచలన ఆరోపణలు చేశారు. తనను చంపుతానంటూ వేలాది ఫోన్లు వచ్చాయని, ఇంత జరిగినా బీఆర్ఎస్‌లో ఎవ్వరూ తనను పట్టించుకోలేదని బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఫామ్ హౌస్ కేసులో వంద కోట్లకు అమ్ముడు పోయానంటూ తనపై అబాండాలు మోపారని చెప్పారు.



# లిటిల్ హార్ట్స్ ప్రేమ చప్పుడు

మిడిల్ క్లాస్ బయోపిక్'ఫేం మౌళి తనుజ్, 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' మూవీతో గుర్తింపు తెచ్చుకున్న శివానీ నాగారం లీడ్‌రోల్స్ పోషిస్తున్న చిత్రం 'లిటిల్ హార్ట్స్'. సాయి మార్తాండ్ దర్శకుడు. ఆదిత్య హాసన్ నిర్మాత. వచ్చే నెల 12న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం ఈ సినిమా సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కథను అందరూ నమ్మారనీ, ఓ విధంగా ఈ కథే తనను దర్శకుడ్ని చేసిందని, వంశీ నందిపాటి, బన్నీ వాస్ ఈ చిత్రాన్ని విడుదల చేయడం ఆనందంగా ఉందని దర్శకుడు సాయి మార్తాండ్ అన్నారు. కంటెంటే ఈ సినిమాకు ప్రధాన బలమని హీరో మౌళి తనుజ్ పేర్కొన్నారు. 'మా '90%ం% మిడిల్‌క్లాస్ బయోపిక్'కి పనిచేసిన వాళ్లే ఈ సినిమాకూ పనిచేశారు. నిర్మాతగా నాకు ఈ సినిమా పూర్తి సంతృప్తినిచ్చింది. రెండుగంటల పాటు హాయిగా నవ్వించే సినిమా ఇది.' అని నిర్మాత ఆదిత్య హాసన్ తెలిపారు. ఇంకా ఈటీవీ బిజినెస్ హెడ్ సాయికృష్ణ, వంశీ నందిపాటి, బన్నీ వాస్ కూడా మాట్లాడారు. రాజీవ్ కనకాల, ఎస్.ఎస్.కాంచి, అనిత చౌదరి, సత్య కృష్ణన్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సూర్య బాలాజీ, సంగీతం: సింజిత్ యెర్రమల్లి, నిర్మాణం: ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్.



# చాయ్ వాలా కహానీ

శివ కందుకూరి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'చాయ్ వాలా'. ప్రమోద్ హర్ష దర్శకుడు. హర్షిక ప్రొడక్షన్స్ పతాకంపై రాధా విజయలక్ష్మి, వెంకట్ ఆర్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో శివ కం దుకూరి, రాజీవ్ కనకాల స్కూటీపై జాలీగా తిరుగుతూ కనిపిస్తున్నారు. హైదరాబాద్ నేపథ్యంలో ప్రేమ, వారసత్వం అనే అంశాల చుట్టూ వినోదం, భావోద్వేగాల ప్రధానంగా నడిచే కథ ఇదని, త్వరలో టీజర్ విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: క్రాంతి వర్ల, సంగీతం: ఆర్.విహారి.





# సూపర్ నాచురల్ బుల్లెట్ బండి

నృత్య దర్శకుడు, నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ కథానాయకుడిగా రూపొందుతున్న సూపర్ నాచురల్ యాక్షన్ థ్రిల్లర్ 'బుల్లెట్ బండి'. లారెన్స్ తమ్ముడు ఎల్విన్ కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇన్నాసి పాండియన్ దర్శకుడు. కేతిరేసన్ నిర్మాత. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఒకేసారి తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను హీరో నాగచైతన్య ఆవిష్కరించి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. స్వర్గీయ నటుడు శ్రీహరి సతీమణి, నాటి నృత్యతార డిస్కోశాంతి.. 28ఏండ్ల విరామం తర్వాత మళ్లీ ఈ సినిమా ద్వారా వెండితెరపై మెరవనున్నారు. చెన్నై, తేంకాసి, కేరళ తదితర అందమైన లొకేషన్లలో చిత్రీకరణ జరిపామని, ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతినిచ్చే సినిమా ఇదని మేకర్స్ చెబుతున్నారు. వైశాలీరాజ్, సునీల్, అరవింద్ ఆకాష్, కాలీ వెంకట్, రంగరాజ్ పాండే, ఆర్.సుందర్‌రాజన్, చామ్స్, శివ శరా, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అరవింద్ సింగ్, సంగీతం: సామ్ .సి.ఎస్.



# ఉండిపోవే నాతోనే..

బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ జంటగా రూపొందుతున్న హారర్ మిస్టరీ థ్రిల్లర్ 'కిష్కిందపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకుడు. సాహు గారపాటి నిర్మాత. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఈ సినిమాలోని తొలిపాటను మేకర్స్ విడుదల చేశారు. 'ఉండిపోవే నాతోనే..' అంటూ సాగే ఈ పాటను పూర్ణాచారి రాయగా, చైతన్య భరద్వాజ్ స్వరపరిచారు. జావేద అలీ ఆలపించారు. బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్‌ల కెమిస్ట్రీ ఈ పాటలో అద్భుతంగా ఉంటుందని, ప్రేమలోని భావోద్వేగాలను ఆవిష్కరించేలా ఈ పాట సాగిందని, అందమైన బీచ్ సైడ్ విజువల్స్ చాలా ప్లెజెంట్‌గా ఉంటాయని మేకర్స్ తెలిపారు. రాజుసుందరం కొరియోగ్రఫీ ఈ పాటకు హైలైట్‌గా నిలుస్తుందని కూడా తెలియజేవారు.

# నా మావ పిల్లనిత్తానన్నాడే..

హీరో నాగశౌర్య అప్ కమింగ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బ్యాడ్ బాయ్ కార్తీక్'. విధి కథానాయిక. రామ్ దేశినా దర్శకుడు. శ్రీనివాసరావు చింతలపూడి నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్‌ని వేగవంతం చేశారు. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన వచ్చిందని మేకర్స్ చెబుతున్నారు. తాజాగా ఈ సినిమాలోని తొలి పాటను విడుదల చేశారు.'నా మావ పిల్లనిత్తానన్నాడే..' అంటూ సాగే ఈ పాటను కాసర్ల శ్యామ్ రాయగా, హేరిస్ జైరాజ్ స్వరపరిచారు. కారుణ్య, హరిప్రియ కలిసి ఆలపించారు. నాగశౌర్య, విధి కెమిస్ట్రీ ఈ పాటలో చాలా కలర్‌ఫుల్‌గా ఉంటుందని, వారి డాన్స్ మూమెంట్స్ కూడా ఆకట్టుకుంటాయని మేకర్స్ చెబుతున్నారు. సీనియర్ నరేష్, సాయికుమార్, సముద్రఖని, శ్రీదేవి విజయ్‌కుమార్, వెన్నెల కిశోర్, మైమ్ గోపీ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రసూల్ ఎల్లోర్, నిర్మాణం: శ్రీవైష్ణవి ఫిల్మ్స్.



# నిధుల్లేక నీరసం

## ముందుకు సాగని సాగునీటి ప్రాజెక్టుల పనులు ఐదేళ్లలో కేటాయింపులు ఘనం..ఖర్చు స్వల్పమే

: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ప్రభుత్వం విస్మరించింది. తమ పార్టీ అధికారంలోకి రాగానే ప్రాధాన్యతా క్రమంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక సాగునీటి ప్రాజెక్టులన్నిటినీ అటకెక్కించారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం నుండి కరువు ప్రాంతాలకు జలకళను పంచే హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు నగరి స్రవంతి, రాయలసీమ ఎత్తిపోతల పథకం, వెలిగొండ ప్రాజెక్టు, పల్నాడు కరువు నివారణ ప్రాజెక్టు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఇలా ప్రతి ప్రాజెక్టు నిర్మాణం ఈ ఐదేళ్లకాలంలో నిధుల్లేక నీరసించిపోయాయి. బడ్జెట్ కేటాయింపుల్లో రూ.61,573 కోట్లు చూపినా.. రూ.33 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు లెక్కలు తెలుపుతున్నాయి. తాము అధికారంలోకి రాగానే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇచ్చి ప్రాజెక్టును సత్వరం పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ చేసింది లేదు. పునరావాసానికి నిధులివ్వని కేంద్రాన్ని నిలదీసిందీ లేదు. రెండు దశలుగా నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పిన ప్రభుత్వం మొదటి దశకు సంబంధించి 41.15 మీటర్లు వరకూ వుండే పునరావాసానికి కూడా నిధులివ్వలేదు. 2019 నాటికి పూర్తి చేస్తామని టిడిపి ప్రభుత్వం చెబితే, 2021 నాటికి పూర్తి చేస్తామని వైసిపి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు చేసినా.. 2026 నాటికి గానీ మొదటి దశ పనులు పూర్తికావని కేంద్ర ప్రభుత్వం ఏకంగా పార్లమెంటులో ప్రకటన చేసింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పోలవరం ప్రాజెక్టును అటకెక్కించి నట్లే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన ప్రాజెక్టులన్నింటినీ నిలిపేసింది. అలాగే వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి రెండు టన్నెల్ నిర్మాణాలు పూర్తయినా పునరావాసానికి సంబంధించి భూసేకరణ కోసం రూ.1,100 కోట్లు చెల్లించక పోవడంతో నీరు ఎప్పుడు వస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రాజెక్టు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజె క్టును అటకెక్కించేశారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి రెండో దశ విస్తరణ పనులను ప్రారంభించ కుండా కాంట్రాక్టరు మొండికేశారు. పనులు చేస్తే బిల్లులు రావనే కారణంతో చాలా పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు పనులు చేయని పరిస్థితి వుంది. కొత్త ప్రాజెక్టులను అటకెక్కిం చడమే కాదు.. వున్న ప్రాజెక్టుల నిర్వహణకు నిధులివ్వలేదు. అలాగే పులిచింతల ప్రాజెక్టు, పింఛా డ్యామ్, అన్నమయ్య, గుండ్లకమ్మ తదితర ప్రాజెక్టులు ధ్వంసమయ్యాయి. సాగునీటి ప్రాజెక్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# పోకిరీల బెండు తీస్తున్న షీటీమ్స్

**న్యూఢిల్లీ,**

ఆడాళ్ల జోలికి వస్తే తోలు తీస్తామంటున్నారు హైదరాబాద్ షీ టీమ్స్. నిత్యం పబ్లిక్ ప్లేసుల్లో మారు వేషాల్లో గస్తీ కాస్తూ ఆకతాయిలను అదుపులోకి తీసుకుంటున్నారు. తాజాగా మహిళలను పబ్లిక్ ప్రదేశాల్లో వేధించిన 33 మందిని సైబరాబాద్ షీ టీమ్స్ అరెస్ట్ చేశాయి. ఆగస్టు 3 నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్‌లో ఈ అరెస్టులు జరిగాయి. వివిధ సోర్సుల ద్వారా మహిళల నుంచి వచ్చిన 25 ఫిర్యాదులకు షీ టీమ్స్ తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాయి. అంతే కాకుండా, కాపురంలో విబేధాలతో సతమతం అవుతున్న 21 జంటలకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లలో కూర్చోబెట్టి మాట్లాడి, సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేశారు. జూలై నెలలో మాత్రమే షీ టీమ్స్ 49మందిని అరెస్ట్ చేశారు. 48 పెట్టి కేసులు నమోదు చేసి, అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళా బాధితుల నుంచి 30 ఫిర్యాదులు అందుకుని.. వాటిపై తక్షణ చర్యలు చేపట్టారు. మహిళలు, బాలికల భద్రత కోసం 64 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సైబరాబాద్ ఉమెన్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్‌లో 5 కౌన్సెలింగ్ సెషన్లు కూడా ఏర్పాటు చేశారు. సైబరాబాద్ షీ టీమ్స్ 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ.. మహిళల భద్రత కోసం కట్టుబడి ఉన్నాయని అధికారులు వివరించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా మహిళలు నిరభ్యంతరంగా షీ టీమ్స్‌ను సంప్రదించాలని.. కోరితే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆభరణాల తనిఖీ

**విశాఖ,**

సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆభరణాలను ఫైవ్‌మాన్ కమిటీ సభ్యులు తనిఖీలు చేస్తున్నారు. గత ఏడాది కడప ప్రాంతానికి చెందిన ప్రభాకరాచారి అప్పన్న భక్తులు సమర్పించిన రజిత, స్వర్ణ ఆభరణాల తూనికల్లో తేడాలున్నాయని, కొన్ని ఆభరణాలు మాయమయ్యాయని, వాటి నిజాలు నిగ్గు తేల్చాలని దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ కె.సుబ్బారావు విచారణకు ఆదేశించారు. ఈ మేరకు దేవదాయశాఖ జ్యువలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ పల్లం రాజు ఈ ఏడాది జనవరి 17, 18 తేదీల్లో రికార్డులను పరిశీలించా రు. ఆలయం, పద్మనిధి, ట్రెజరీలో ఆభరణాలను తూనికలు వేసి రికార్డులను సిద్ధం చేశారు. కానీ ఆభరణ ప్రదర్శనశాలలోని వస్తువులు తనిఖీ చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రక్రియను పూర్తిచేయాలని విజయనగరం మాన్సాస్, అరసవల్లి దేవస్థానం ఈఓ ప్రసాద్ చైర్మన్‌గా ఫైవ్‌మాన్ కమిటీని నియమించారు. ఈ మేరకు ఫైవ్‌మాన్ కమిటీ శనివారం ఆభరణాలు తనిఖీలు చేపట్టారు.

# 1,50,159 కోట్లకు పెరిగిన భారత రక్షణరంగ ఉత్పత్తులు

**న్యూఢిల్లీ,**

భారతదేశ వార్షిక రక్షణ ఉత్పత్తి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.1,50,590 కోట్లకు పెరిగింది. ఇది 2023-24లో ఉన్న రూ.1.27 లక్షల కోట్లతో పోలిస్తే 18 శాతం వృద్ధిని సూచిస్తుంది. అంతేకాదు, ఈ పెరుగుదల 2019-20 ఆర్థిక సంవత్సరం నుండి చూస్తే, ఏకంగా 90 శాతం వృద్ధిని ప్రతిబింబిస్తుంది. అప్పట్లో దీని విలువ రూ.79,071 కోట్లుగా ఉంది. ఈ మైలురాయిని సాధించడంలో రక్షణ ఉత్పత్తి శాఖ, ఇంకా డీపీఎస్‌యులు, ప్రభుత్వ రంగ తయారీదారులు, ఇంకా ప్రైవేట్ పరిశ్రమలతో సహా అందరి సమిష్టి కృషిని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. ఇది భారతదేశ రక్షణ పారిశ్రామికరంగ పెరుగుదలకు స్పష్టమైన సూచికగా మంత్రి అభివర్ణించారు. ఢిల్లీలో ఈ మేరకు రక్షణ మంత్రి వివరాలు వెల్లడించారు. మోదీ సర్కారు తీసుకొచ్చిన ఆత్మనిర్భర్ భారత్ కింద రక్షణ తయారీలో స్వయం సమృద్ధిని ఈ పెరుగుదల నొక్కి చెబుతోందని కేంద్ర మంత్రి అన్నారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, భారతదేశ అవసరాలను తీర్చడమే కాకుండా ఎగుమతుల సామర్థ్యాన్ని బలోపేతం చేసే రక్షణ పారిశ్రామిక సముదాయాన్ని సృష్టించడంపై చూపిన ప్రాధాన్యత ఈ సానుకూల ఫలితాలను అందించిందని మంత్రి తెలిపారు. డీపీఎస్‌యులు, ఇతర ఆయుధాలు మొత్తం ఉత్పత్తిలో దాదాపు 77 శాతం వాటాను కలిగి ఉండగా, ప్రైవేట్ రంగం 23 శాతం వాటాను కలిగి ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 21 శాతం నుండి 2024-25 ఆర్థిక సంవత్సరంలో 23 శాతానికి పెరిగిన ప్రైవేట్ రంగం వాటా, దేశ రక్షణ పర్యావరణ వ్యవస్థలో తన పాత్రను వెల్లడిచేస్తుంది. గత దశాబ్దంలో విధాన సంస్కరణలు, వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరచడం, స్వదేశీ తయారీపై వ్యూహాత్మక ముందుచూపు కారణంగా రక్షణ పరిశ్రమలోని ప్రభుత్వ, ప్రైవేట్ విభాగాలు రెండూ స్థిరమైన వృద్ధిని ప్రదర్శించాయి.

# వైఎస్ సునీతారెడ్డి ఆవేదన అర్థంచేసుకోవాలి

## ఆమెకు అంతా అండగా నిలవాల్సిందే: లోక్‌సత్తా

**విజయనగరం,**

తన తండ్రి మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య జరిగి ఆరేళ్ల అయినా తమ కుటుంబానికి న్యాయం జరగలేదంటున్న వైఎస్ సునీత రెడ్డి ఆవేదనను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. తన తండ్రిని హత్య చేసిన వారు.. దానికి సహకరించిన వారు.. రాజకీయాల నీడలో పబ్లిక్‌గా తిరుగుతుంటే ఎవ్వరు ఏమి చెయ్యలేని పరిస్థితి నెలకొందని ఆమె ఆందోళన చెందుతున్నారన్నారు. హైకోర్టులో 6 కేసులు, సుప్రీంకోర్టులో 6 కేసులు ఉన్నాయని,ఆమె చెబుతున్నారని ఒక ఆడపిల్ల ఆధారాలతో ఎవరు హత్య చేశారో, దానికి ఎవరు సహకరించారో,ఎవరు తమ కుటుంబాన్ని ఎలా తప్పుత్రోవ పట్టించారో వివరాలతో ప్రాణాలకు తెగించి బయట పెడుతున్నా,పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ,కేంద్ర దర్యాప్తు సంస్థలు త్వరగతిన న్యాయం చేయకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరగా తగిన న్యాయం సునీత రెడ్డికి జరిగేలా చర్యలు తీసుకోవాలని భీశెట్టి కోరారు. రాజకీయాల్లో వివేకా హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోందని,దర్యాప్తు సంస్థలు మొద్దు నిద్రలో ఉన్నట్టు- కనిపిస్తోందని భీశెట్టి ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా కుట్రలు ఛేదించడంలో విఫలం కావడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నట్టు- ప్రజలు అభిప్రాయపడుతున్నారని ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకి మంచిది కాదన్నారు.

# మంత్రాలయ ఉత్సవాలకు టిటిడి పట్టు వస్త్రాలు

**మంత్రాలయం,**

తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన పట్టు- వస్త్రాలు ఊరేగింపుతో రాఘవేంద్రస్వామి మఠం చేరుకున్నాయి. శనివారం రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల సందర్భంగా టిటిడి ఎఇఓ రామకృష్ణ తిరుమల తిరుపతి దేవస్థానాల నుండి శ్రీవారి వస్త్రాన్ని తీసుకువచ్చారు. శ్రీ మఠం అధికారులు,పండితుల వేద మంత్రాల మధ్య మంగళ వాయిద్యాల నడుమ ప్రధాన ఆర్చి మహాద్వారం వద్ద నుంచి సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. మధ్వ కారిడార్ గుండా శ్రీ మఠానికి చేరుకున్న వారు గ్రామ దేవత శ్రీ మంచలమ్మకు చీరను అందజేసి విశేష పూజలతో సమర్పణతో మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీవారి వస్త్రాన్ని స్వామిజీకి అప్పగించారు. శ్రీ స్వామిజీ భక్తితో శ్రీ స్వామి వారి మూల బందావనం వద్ద వస్త్రాన్ని సమర్పించారు. అనంతరం టీటీడీ అధికారులు శ్రీవారీ శేషవస్త్రం, ప్రసాదాలను స్వామిజీకి సమర్పించారు. ఈ సందర్భంగా స్వామిజీ శ్రీరామకృష్ణ ను అతని కుటుంబ సభ్యులకు ఆశీర్వదించారు, వారిని శేషవస్త్రం, మెమెంటో మరియు ఫల మంత్రాక్షతలు అందజేసి సత్కరించారు.

# ‘కొల్లేరు’పై కల్లబొల్లి మాటలు !

## ప్రజలను మోసగిస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు

: కొల్లేరు ప్రజలను మరోసారి మోసగించేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు సిద్ధమయ్యాయి. ఓట్ల కోసం నిస్సిగ్గుగా మాయమాటలు చెబుతున్నాయి. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని, అక్కడి ప్రజలను ఆదుకుంటామని చెప్పి మళ్లీ హామీలు గుప్పిస్తున్నాయి. కొల్లేరు ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపకుండా వంచించడంలో ప్రధాన ముద్దాయి బిజెపినే. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీకి కాంటూరు కుదింపు ఏమంత కష్టం కాదు. మాతోనే కొల్లేరు సమస్య పరిష్కారమంటూ కైకలూరు బిజెపి అభ్యర్థి మళ్లీ చెప్తుండడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొల్లేరు ప్రాంతం 77 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. కొల్లేరులో బెడ్, బెల్ట్ గ్రామాలు 120కుపైగా ఉన్నాయి. ఈ గ్రామాల్లోని లక్షలాది మంది ప్రజలు కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్నారు. కొల్లేరులో సంప్రదాయ పద్ధతిలో రైతులు వరి సాగు చేసేవారు. జలగం వెంగళరావు ప్రభుత్వ హయాంలో కొల్లేరు గ్రామాల్లో సొసైటీలు ఏర్పాటు చేసి భూములను పంపిణీ చేశారు. భూములు చేపల చెరువులకు అనుకూలంగా ఉంటాయంటూ ప్రభుత్వమే బలవంతంగా చేపల చెరువులు తవ్వించింది. అయితే, 2005లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కొల్లేరులోని చేపల చెరువులన్నింటినీ బాంబులు పెట్టి ధ్వంసం చేశారు. కొల్లేరు భూములనే కాకుండా దాదాపు పది వేల ఎకరాల్లోని పట్టా భూముల్లోని చెరువులను ధ్వంసం చేయడంతో అప్పటి నుంచి కొల్లేరు ప్రజల బతుకులు దుర్భరంగా మారాయి. ఉపాధి లేక కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు వలస వెళ్లి బతుకులు నెట్టుకొస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో టిడిపి, బిజెపి కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయి. భీమవరంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని అభ్యర్థిగా ఉన్న మోడీ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని హామీ ఇచ్చారు. దీంతో, కైకలూరు ఎమ్మెల్యేగా బిజెపి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌ను ప్రజలు గెలిపించారు. సర్వేల పేరుతో హడావుడి చేయడం తప్ప, కొల్లేరు ప్రజలకిచ్చిన మాటను నిలుపుకోలేదు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రంలోని టిడిపి, బిజెపి ప్రభుత్వం అప్పట్లో చేతులు దులుపుకుంది. ధ్వంసం చేసిన పట్టా భూములను రైతులకు అప్పగించలేదు. అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నా బాధిత ప్రజలకు నేటికీ న్యాయం జరగలేదు.

### ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో వైసిపి వెన్నుపోటు !

2019 ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామంటూ వైసిపి హామీ ఇచ్చింది. అయితే, అధికారంలోకి వచ్చాక మూడో కాంటూరు కుదింపుపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేలేకపోయింది. కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీనీ గాలికొదిలేసింది. మూడో కాంటూరుకు కుదింపును పక్కనపెట్టి ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కొల్లేరు ప్రజలకు వెన్నుపోటు పొడించేందుకు సిద్ధమైంది. కొల్లేరును పదో కాంటూరు వరకూ విస్తరించేందుకు ఏరియల్ సర్వే నిర్వహించడంతోపాటు మండల కేంద్రాల్లో ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసింది. దాదాపు మరో 80కుపైగా గ్రామాలను ఎకోసెన్సిటివ్ జోన్‌లోకి చేర్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. ప్రజలు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోలేదు.

### మళ్లీ ఓట్ల కోసం మోసపూరిత మాటలు

ప్రస్తుత ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. పొత్తులో భాగంగా కైకలూరులో బిజెపి పోటీ చేస్తోంది. 2014లో గెలుపొందిన కామినేని శ్రీనివాస్‌కే మరోసారి టికెట్ దక్కింది. అప్పుడు ఐదేళ్లపాటు కొల్లేరు ప్రజలను మోసగించిన బిజెపి అభ్యర్థి%ా% కొల్లేరు సమస్య మాతోనే పరిష్కారమంటూ ఇప్పుడు మళ్లీ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. వైసిపి, టిడిపి కూడా కొల్లేరు ప్రజలను మరోసారి మాటమాటలతో మభ్యపెట్టాలని చూస్తున్నాయి. ఈ పార్టీల తీరును నిశితంగా గమనిస్తున్న కొల్లేరు ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని అంటున్నారు.



## ఘనంగా రాఖీ పండుగ వేడుకలు.....

### రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు....



నల్గొండ: అక్షర కలం ప్రతినిధి :

ఈ రోజు రాఖీ పౌర్ణమి సందర్భంగా గౌరవ శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీమతి దుబ్బ రూప అశోక్ సుందర్ రాఖీ కట్టడం జరిగింది. ఈ సందర్భంగా గౌ. శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తు, రాఖి పండుగ శుభాకాంక్షలు తెలుపడం జరిగింది.

## 17 ఏళ్లకే కెప్టెన్.. వరల్డ్ రికార్డు నమోదు!

టీమిండియాలో 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశి రికార్డుల గురించే ఇటీవల కాలంలో ఎక్కువగా చర్చ జరిగింది. అయితే, క్రికెట్ ప్రపంచంలో సంచలనం సృష్టించిన మరొక యువ కెప్టెన్ జాక్ వుకుసిక్ గురించి తెలుసుకుందాం. ఈ యువ క్రికెటర్ ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అత్యంత పిన్న వయస్కుడైన కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు. టీనేజ్ క్రికెటర్లు అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టడం అనేది ఇప్పుడు సర్వసాధారణం. అయితే, కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టడం అనేది చాలా అరుదు. ఇప్పుడు జోక్ వుకుసిక్ అనే 17 ఏళ్ల యువ క్రికెటర్ అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అతి చిన్న వయసులో కెప్టెన్సీ పగ్గాలు చేపట్టి ప్రపంచ రికార్డు సృష్టించాడు. జోక్ వుకుసిక్ అంతర్జాతీయ క్రికెట్‌లో కెప్టెన్సీ చేసిన అతి చిన్న వయసు ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. కేవలం 17 సంవత్సరాల 311 రోజుల వయసులో క్రొయేషియా తరపున సైప్రస్‌పై కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టి ఈ రికార్డును సాధించాడు. 2022లో ఫ్రాన్స్ కెప్టెన్ నోమాన్ అమ్జాద్ (18 ఏళ్ల 24 రోజులు) పేరిట ఉన్న రికార్డును జోక్ బద్దలు కొట్టాడు. కొద్ది రోజుల క్రితం, వైభవ్ సూర్యవంశీ అనే 14 ఏళ్ల యువ క్రికెటర్ టీ20ల్లో అతి చిన్న వయసులో సెంచరీ చేసి రికార్డు సృష్టించాడు. అదే విధంగా, జోక్ వుకుసిక్ కూడా అంతర్జాతీయ క్రికెట్‌లోనే కాదు, టీ20లలో కూడా కెప్టెన్సీ చేసిన అతి చిన్న వయసు క్రికెటర్‌గా నిలిచాడు. వైభవ్ సూర్యవంశీ చిన్న వయసులో సెంచరీ సాధిస్తే, జోక్ వుకుసిక్ చిన్న వయసులో కెప్టెన్‌గా నిలిచి రికార్డు నెలకొల్పాడు. టీ20 క్రికెట్‌లో అత్యంత చిన్న వయసులో కెప్టెన్సీ చేసిన రికార్డు గతంలో పాకిస్తాన్ ఆటగాడు తైమూర్ అలీ పేరిట ఉండేది. అతను 2009లో 17 ఏళ్ల 358 రోజుల వయసులో క్వెట్టా బియర్స్‌కు కెప్టెన్సీ చేశాడు. 16 సంవత్సరాల తర్వాత ఇప్పుడు ఆ రికార్డును జోక్ వుకుసిక్ బద్దలు కొట్టాడు. ఈ యువ క్రికెటర్ భవిష్యత్తులో కూడా ఇలాంటి అద్భుతాలు సృష్టిస్తాడని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## చెన్నైకి గుడ్ బై చెప్పనున్న అశ్విన్!

2026 ఐపీఎల్ సీజన్‌కు చాలా సమయం ఉన్నప్పటికీ ట్రేడింగ్?పై రోజుకో ?చర్చ తెరపైకి వస్తుంది. ఇప్పటికే రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజు శాంసన్ జట్టును వీడేందుకు నిర్ణయించుకున్నాడని రీసెంట్?గా వార్తలు రాగా, సీనియర్ ప్లేయర్లు రవిచంద్రన్ అశ్విన్ కూడా అదే బాటలో నడిచేందుకు డిసైట్ అయినట్లు తెలుస్తోంది. తాజాగా అతడు కూడా తనను జట్టు నుంచి రిలీజ్ చేయాలని చెన్నై సూపర్ కింగ్స్? ఫ్రాంచైజీకి రిక్వెస్ట్ చేశాడనని సమాచారం. రవిచంద్రన్ అశ్విన్ తనను రిలీజ్ చేయాలని చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్?మెంట్?కు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. అయితే దీనిపై అశ్విన్ నుంచి గానీ లేదా ఫ్రాంచైజీ నుంచి గానీ, అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. కాగా ఐపీఎల్ తొలి ఎడిషన్? నుంచి ఆడుతున్న అశ్విన్, 2008 నుంచి 2015 వరకు చెన్నైతోనే ఉన్నాడు. ఆ తర్వాత దాదాపు తొమ్మిది సీజన్లలో పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, పుణె సూపర్ జెయింట్స్ తదితర జట్లకు ఆడాడు. ఇక దాదాపు పదేళ్ల తర్వాత ఈ సీజన్?లోనే అశ్విన్ చెన్నైలో చేరాడు. అశ్విన్?ను చెన్నై 2024లో జరిగిన మెగావేలంలో రూ.9.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. 2025 సీజన్?లో 9 మ్యాచ్?లు ఆడిన అశ్విన్ 7 వికెట్లే తీసి నిరాశపర్చాడు. అయితే ఇప్పుడు చెన్నై నుంచి వెళ్లిపోయి, రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించాలను అనుకుంటున్నట్లు సమాచారం. అయితే అశ్విన్ వచ్చే ఏడాది ట్రేడింగ్ లేదా వేలంలోకి వెళ్లడం అనేది పూర్తిగా చెన్నై ఫ్రాంచైజీ నిర్ణయమే.

## అదృష్టంతోనే ఓటమి నుంచి ఇంగ్లండ్ గట్టెక్కింది

ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ మాంటీ పనేసర్

భారత్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ అదృష్టంతోనే ఓటమి తప్పించుకుందని ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ మాంటీ పనేసర్ అన్నాడు. లార్డ్స్ టెస్ట్‌లో లక్కీగా ఇంగ్లండ్ గెలిచిందని, ఈ మ్యాచ్‌లో భారత్ గెలవాల్సిందని అభిప్రాయపడ్డాడు. ఈ ఐదు టెస్ట్‌ల అండర్సన్–సచిన్ ట్రోఫీని భారత్ 2–2తో సమం చేసుకున్న విషయం తెలిసిందే. ఓవల్ వేదికగా జరిగిన ఆఖరి టెస్ట్‌లో సిరాజ్ అద్భుత ప్రదర్శనతో టీమిండియా 6 పరుగుల తేడాతో గెలుపొందింది. లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్ట్‌లో టీమిండియా తృటిలో విజయాన్ని చేజార్చుకుంది. ఆఖరి వికెట్‌గా సిరాజ్ వెనుదిరగడంతో టీమిండియాకు ఓటమి తప్పలేదు. తాజాగా ఈ సిరీస్ ఫలితంపై మాట్లాడిన మాంటీ పనేసర్.. భారత్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. 'ఐపీఎల్ ముగిసిన వెంటనే టీమిండియా.. ఇంగ్లండ్ పర్యటనకు వచ్చింది. ఈ సిరీస్‌లో భారత ఆటగాళ్లు అద్భుతంగా ఆడారు. అసాధారణ బ్యాటింగ్‌తో నాలుగో టెస్ట్‌ను భారత్ డ్రా చేసుకుంది. లార్డ్స్‌లో గెలిచే మ్యాచ్‌ను చేజార్చుకుంది. ఈ మ్యాచ్‌లో సిరాజ్ ఔటవ్వడంతో లక్కీగా ఇంగ్లండ్ గెలిచింది. ఓవల్ వేదికగా జరిగిన ఆఖరి టెస్ట్‌లో భారత్ అద్భుతంగా ఆడింది. ముఖ్యంగా ఆఖరి రోజు మేఘావృతమైన పరిస్థితుల మధ్య భారత బౌలర్లు అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. ఆ రోజు అన్నీ భారత్‌కు అనుకూలించింది. టీమిండియా ఆటతీరు చాలా మెరుగుపడింది. ఓవల్ విజయంతో ఈ సిరీస్ సమమైనా విజేత భారత్ అనే ఫీలింగ్ కలిగింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించడంతో ఇంగ్లండ్ సునాయసంగా విజయం సాధిస్తుందని అంతా అనుకున్నారు. కానీ ఈ సిరీస్‌ను సమం చేసుకొని భారత జట్టు తమ బలాన్ని ప్రదర్శించింది. బుమ్రా లేకున్నా భారత్ విజయాలు సాధించడం ప్రారంభించింది. భవిష్యత్తులో సిరాజ్ చుట్టూ బౌలింగ్ యూనిట్'అని పనేసర్ చెప్పుకొచ్చాడు.

## నాలుగో స్థానానికి పడిపోయిన ఇంగ్లండ్

సొంతగడ్డపై భారత్ ఇచ్చిన షాక్ నుంచి ఇంగ్లండ్ కోలుకోలేకపోతుంది. ఐదు టెస్ట్‌ల అండర్సన్– సచిన్ ట్రోఫీలో అసాధారణ ప్రదర్శన కనబర్చిన భారత్ 2–2తో సమం చేసుకుంది. ఈ సిరీస్ అసాంతం అసాధారణ ప్రదర్శన కనబర్చిన భారత్.. ఇంగ్లండ్‌ను ఉక్కిరి బిక్కిరి చేసింది. ఈ ఫలితం కారణంగా డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో ఇంగ్లండ్ నాలుగో స్థానానికి పడిపోయింది. మరోవైపు భారత్ మూడో స్థానంలో కొనసాగుతోంది. అయితే డబ్ల్యూటీసీ ఛాంపియన్‌షిప్‌ను డబుల్ టైర్ విధానంలో నిర్వహించాలని ఐసీసీ భావిస్తోంది. అయితే ఈ ప్రతిపాదనను ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) వ్యతిరేకిస్తుంది. టూ టైర్ విధానంలో ఛాంపియన్‌షిప్ నిర్వహిస్తే.. ఇంగ్లండ్ తక్కువ స్థాయి దేశాలతో మ్యాచ్‌లు ఆడాల్సి వస్తుంది. టాప్ పెర్ఫామెన్స్ కనబర్చే భారత్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, న్యూజిలాండ్ టాప్ గ్రూప్‌లో ఉంటే.. ఇంగ్లండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, జింబాబ్వే, వెస్టిండీస్ జట్లతో ఇంగ్లండ్ రెండో గ్రూప్‌లో ఆడాల్సి ఉంటుంది. అదే జరిగితే తక్కువ స్థాయి జట్లతో ఆడటం వల్ల ఇంగ్లండ్ రెవెన్యూపై దెబ్బపడుతుంది. ఈ క్రమంలోనే ఈ టూ టైర్ వ్యవస్థను ఈసీబీ వ్యతిరేకిస్తోంది. ఈ విధానానికి తాము వ్యతిరేకమని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు చైర్మన్ రిచర్డ్ థాంప్సన్ స్పష్టం చేశారు. భారత్, ఆస్ట్రేలియాతో ఆడకుంటే ఇంగ్లండ్ ఆదాయం దెబ్బతింటుంది. ముఖ్యంగా యాషెస్ సిరీస్ ఆడలేకపోతే.. ఇంగ్లండ్ టెస్ట్ క్రికెట్ మనుగడనే ప్రశ్నార్థకంగా మారుతుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ తొలి రెండు ఎడిషన్స్‌లో ఇంగ్లండ్ పేలవ ప్రదర్శన కనబర్చింది. తొలి ఎడిషన్(2019–21)లో నాలుగో స్థానంలో నిలిచిన ఇంగ్లండ్.. రెండో ఎడిషన్(2021–23)లో కూడా నాలుగో స్థానంతోనే సరిపెట్టుకుంది. (2023–25) ఎడిషన్‌లోనూ ఫైనల్ చేరలేకపోయింది. బాజ్ బాల్ అప్రోచ్ ఇంగ్లండ్ కొంపముంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ అప్రోచ్‌తో ఇంగ్లండ్ కొన్ని అద్భుతమైన విజయాలు సాధించినప్పటికీ ఆశించిన ఫలితాలు దక్కలేదు.

## ఐదవ టెస్ట్‌లో సెంచరీ సాధించిన ఏకైక భారతీయ బ్యాట్స్‌మన్ యశస్వి జైస్వాల్

టెస్ట్ బ్యాటింగ్ ర్యాంకింగ్‌లో 3 స్థానాలు ఎగబాకాడు. అతను టాప్ 5లో చేరాడు, అతను ఇంతకు ముందు 8వ స్థానంలో ఉన్నాడు మరియు ఇప్పుడు 792 రేటింగ్‌తో ఐదవ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లాండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ ఒక స్థానం ఎగబాకి రెండో స్థానానికి చేరుకున్నాడు. నంబర్ 1 టెస్ట్ బ్యాట్స్‌మన్ కిరీటం జో రూట్ వద్దే ఉంది, అతను 5వ టెస్ట్‌లో సెంచరీ కూడా సాధించాడు. ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ 908 రేటింగ్ పాయింట్లతో టాప్ పొజిషన్ కొనసాగిస్తున్నాడు. ఇంగ్లాండ్ కే చెందిన హ్యారీ బ్రూక్ 2, కేన్ విలియమ్సన్ 3, స్టీవ్ స్మిత్ 4, యశస్వీ జైస్వాల్ 5వ స్థానాల్లో నిలిచారు. టెస్ట్‌లో నంబర్ 1 ఆల్ రౌండర్‌గా రవీంద్ర జడేజా కొనసాగుతున్నాడు. ఇంతకు ముందు 7వ స్థానంలో ఉన్న జో రూట్ ఇప్పుడు 8వ స్థానానికి పడిపోయాడు. గస్ అట్కిన్సన్ ఒక స్థానం ఎగబాకి 9వ స్థానానికి చేరుకున్నాడు. టాప్ 5 లో ఎలాంటి మార్పు లేదు. టెస్టు ఆల్ రౌండర్లలో జడేజా ఆధిపత్యం కొనసాగుతోంది. 405 రేటింగ్ పాయింట్లతో జడేజా నెంబర్ వన్ గా కొనసాగుతున్నాడు. రెండో స్థానంలో ఉన్న మెహదీ హసన్ కంటే ఏకంగా 100 రేటింగ్ పాయింట్లు అధికంగా జడేజా ఖాతాలో ఉన్నాయి. బెన్ స్టోక్స్ 3, వియాన్ ముల్డర్ 4, పాట్ కమిన్స్ 5వ స్థానాల్లో ఉన్నారు.

## ఇప్పటికైనా సిరాజ్ ప్రతిభను గుర్తించాలి

### ముఖ్యమైన సిరీస్ లలో మాత్రమే ఆడించాలి

### భారత మాజీ ఆల్ రౌండర్ రవిచంద్రన్ అశ్విన్

ఇంగ్లాండ్ తో జరిగిన ఐదో టెస్టులో టీమిండియా విజయం సాధించడం వెనకాల హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ లో తొమ్మిది వికెట్లతో చెలరేగిన సిరాజ్.. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును సైతం సొంతం చేసుకున్నాడు. ముగ్గురు బ్యాటర్లు సెంచరీలు చేసినప్పటికీ, వారిని కాదని, కీలకదశలో వికెట్లు తీసి, ఒత్తిడిని తట్టుకుని నిలబడిన అతడికే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు సిరాజ్ బౌలింగ్ ను చూసి ఫిదా అయ్యారు. ముఖ్యంగా ఐదు టెస్టుల సుదీర్ఘ సిరీస్ లోని అన్ని మ్యాచ్ లు ఆడటంతోపాటు 185కిపైగా ఓవర్లు బౌలింగ్ చేశాడని గుర్తు చేశారు. అలాగే 23 వికెట్లు సాధించి, సిరీస్ లీడింగ్ వికెట్ టేకర్ గా నిలిచాడు. అలాంటి సిరాజ్ పై భారత మాజీ ఆల్ రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసలు కురిపించాడు. ఇన్నాళ్లుగా సిరాజ్ కు రావాల్సినంత గుర్తింపు రాలేదని, ఇప్పటికైనా అతడి ప్రతిభను గుర్తించాలని అశ్విన్ అభిప్రాయ పడ్డాడు. ఈ సిరీస్ లో సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడని, కీలక దశలో వికెట్లు తీసి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడని పేర్కొన్నాడు. అతను టెస్టుల్లో నెంబర్ వన్ బౌలర్ గా మారాడని ప్రశంసించాడు. అతని కమిట్మెంట్ అద్భుతమని, ఐదు టెస్టుల్లోనూ బౌలింగ్ చేసి, అత్యధిక వికెట్లు తీశాడని ప్రశంసించాడు. అయితే వయసు పై బడుతున్న కొద్దీ, అతడిని మెరుగ్గా యూజ్ చేసుకోవాలని, ముఖ్యమైన మ్యాచ్ ల విషయంలో వర్క్ లోడ్ మేనేజ్మెంట్ తనకు కూడా వర్తింప జేయాలని సూచించాడు. ముఖ్యమైన సిరీస్ లలో మాత్రమే అతడిని ఆడించాలని పేర్కొన్నాడు. భారత పేస్ విభాగాన్నిమరింత బలోపేతం చేయాలని, స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా లేని సమయంలో సిరాజ్ ఒక్కడిపైనే టీమ్ ఆధారపడకుండా ప్రత్యామ్నాయాలు సిద్దం చేయాలని అశ్విన్ సూచించాడు. ముఖ్యంగా ఇంగ్లాండ్ పర్యటనలో ఆకాశ్ దీప్, ప్రసిధ్ కృష్ణ అద్భుతంగా ఆడారని, అలాంటి వాళ్లను ప్రొత్సహించాలని, అర్షదీప్ సింగ్ లాంటి యువ బౌలర్లను సిద్ధం చేయాలని తెలిపాడు. ఇక ఇంగ్లాండ్ పర్యటనలో ఐదు టెస్టుల అండర్సన్–టెండూల్కర్ ట్రోఫీ 2–2 తో డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే. తొలి, మూడో టెస్టులో ఇంగ్లాండ్ గెలవగా, రెండు, ఐదో టెస్టులో ఇండియా గెలిచింది. నాలుగో టెస్టు డ్రాగా ముగిసింది. భారత కెప్టెన్ శుభమాన్ గిల్, ఇంగ్లాండ్ విధ్వంసక ప్లేయర్ హేరీ బ్రూక్ కు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు దక్కింది.




## చంద్రబాబు కోరుకునే రాష్ట్ర ప్రయోజనాల్లో స్టీల్‌ప్లాంట్ స్థానం ఎక్కడ ?

### ఉక్కు ఫ్యాక్టరీ వైపు కన్నెత్తి చూడలేదెందుకు !

### నామమాత్రంగానే రాష్ట్ర ప్రభుత్వ స్పందన

### విశాఖ కార్మికులు, ప్రజల్లో నడుస్తోన్న చర్చ

రాష్ట్ర విస్తృత ప్రయోజనాలు, ప్రజల భవిష్యత్తు కోసమే బిజెపితో తెలుగుదేశం పార్టీ పొత్తు పెట్టుకుందని ప్రకటించిన చంద్రబాబుకు మూడేళ్లుగా స్టీల్‌ప్లాంట్ గుర్తుకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, పోలవరం ప్రాజెక్టు తర్వాత వెంటనే వినపడేది వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ అన్నది ఆ పార్టీ నాయకులు సైతం చటుక్కున చెబుతారు. కేంద్రంలోని మోడీ సర్కారు మూడేళ్ల క్రితం విశాఖ స్టీల్‌ప్లాంట్ వంద శాతం వ్యూహాత్మక అమ్మకం చేస్తున్నట్లు తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్ష అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యతిరేకించలేదు. ఇటీవల కేంద్రంలోని బిజెపితో పొత్తు పెట్టుకున్నప్పుడు సైతం టిడిపి, జనసేన అధినేతలు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపుతామని చెప్పకపోవడం ఏ ప్రయోజనాల కోసం వీరు బిజెపితో కలిశారు? అన్న ప్రశ్న రాష్ట్రంలోని కార్మికులే కాదు అన్ని తరగతుల నుంచీ వినిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం, అధికార వైసిపి నామ్‌కేవాస్తేగా ఒక తీర్మానం చేసిందే తప్ప, ప్రయివే టీకరణకు వ్యతిరేకంగా కేంద్రాన్ని నిలేసింది లేదు. వారి తీరు అలా ఉంటే, వీరి తీరు ఇలా ఉంది.

### కనీసం ఆ సభలోనైనా ప్రకటన వస్తుందని

చిలకలూరిపేటలో ఇటీవల జరిగిన బిజెపి, టిడిపి, జనసేన (కూటమి) సభకు దేశ ప్రధానమంత్రి మోడీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన ద్వారా చంద్రబాబు, పవన్ కల్యాణ్ 'స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరగదు' అన్న ప్రకటన చేయిస్తారన్న ఆశతో కార్మికులు చూశారు. కానీ, సభ అంతా పూర్తయినా స్టీల్‌ప్లాంట్ ఊసే లేకపోవడం ప్రజలను తీవ్ర మనస్తాపానికి గురిచేసింది. మోడీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు కుట్రలు కొనసాగిస్తుండడంతో పాటు సొంత గనులు ఇవ్వకుండా ప్లాంట్‌ను ఎండగట్టేసింది. బ్లాస్ట్ ఫర్నేస్–3లోకి జిందాల్‌ను




తీసుకొచ్చేసింది. పలు విభాగాలను ముక్కలు ముక్కలు చేసి ప్రయివేట్ వారికి ఇచ్చేయాలన్న కుట్రలు బిజెపి చేస్తూనే ఉంది.

### ఎందుకు పర్యటించడం లేదు ?

వైజాగ్ స్టీల్‌ను రక్షించుకోవడానికి 1144 రోజులు పోరాటం కొనసాగుతున్నా ఏనాడూ ప్లాంట్ పర్యటనకు చంద్రబాబు రాలేదు. కార్మికులను కలవడంగానీ, వారి పోరాటానికి మద్దతు ప్రకటించడంగానీ చేయలేదు. ఇది స్టీల్‌ప్లాంట్ కార్మికుల్లో తీవ్ర అసంతృప్తిని కలిగించింది. కేంద్రం స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలని నిర్ణయిస్తే ఆ పార్టీతో మీరెలా పొత్తుపెట్టుకున్నారంటూ ఉక్కులో టిఎన్‌టియుసి నేతలను మిగతా కార్మికులు ప్రశ్నిస్తుండడంతో వారి నోట సమాధానం రావడం లేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్ వద్ద లేదా రాష్ట్రంలో ఎక్కడ సభ నిర్వహించినా వైసిపి కబంధ హస్తాల్లో రాష్ట్రం చిక్కుకుందంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ అన్నారే తప్ప, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ సరైంది కాదని ప్రకటించలేదు. టిడిపి నాయకుడు పల్లా శ్రీనివాసరావు (గాజువాక టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి) దీక్ష చేసినప్పుడు సైతం ఆయనను పరామర్శించడానికి రాలేదంటే బిజెపి నిర్ణయాన్ని వ్యతిరేకించే ఉద్దేశం చంద్రబాబుకు లేదని స్పష్టమవుతోంది.

### నాగర్‌నార్ ఉక్కు ఫ్యాక్టరీ ప్రతిపక్షాల ఆందోళనతో నిలవలేదా ?

కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై ప్రజలు, కార్మికులు చేస్తోన్న పోరాటాలు ఆయా రాష్ట్రాల్లోని అధికార పక్షం లేదా ప్రతిపక్షం కలిసి వస్తే విజయం అవుతాయి. దీనికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నాగర్‌నార్ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాటం తాజా ఉదాహరణ. ఈ ఫ్యాక్టరీని బిజెపి ప్రయివేటీకరణకు పెట్టిన సందర్భంగా అక్కడి ప్రతిపక్షాలు పోరాడి నిలుపుదల చేశాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో మన రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు రెండూ బిజెపి నిర్ణయాన్ని గట్టిగా వ్యతిరేకించడం లేదు. 2024 ఎన్నికల్లో అధికారం కోసం ఆశిస్తోన్న టిడిపి, ఈ రాష్ట్ర జనహితం, భవిష్యత్తు కోసం దేనికైనా సిద్ధం అని చెప్పుకుంటున్న జనసేన కూడా బిజెపికి వంతపాడుతూ వస్తున్నాయి. బిజెపితో పొత్తు జనహితమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెబుతున్నప్పుడు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ జనహితం కాదా? అనేది చెప్పాలి.

# మంత్రి తుమ్మల కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీస్:



**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు రాఖీపౌర్ణమి సందర్భంగాహైదరాబాద్ లోని మంత్రి క్వాటర్స్ లో ఆయనకు రాఖీకట్టి శుభాకాంక్షలు తెలియజేసిన బ్రహ్మకుమారీస్ నా తెలంగాణ ఆడపడుచులకు, నా ప్రియమైన అక్కాచెల్లెళ్లకు రాఖీ పండుగ శుభాకాంక్షలు. అన్నా చెల్లెళ్ల అనుబంధం వ్యక్తం చేస్తూ 'నీ కోసం నేనున్నాను' అనే భరోసా కల్పించే శుభ సందర్భమే రాఖీ పర్వదినం. అందుకే రాఖీ పౌర్ణమి మనందరికి ప్రత్యేకం. మీ అందరికి ఒక అన్నగా మీకు రక్షణ కల్పించే, మీ జీవితాల్లో వెలుగులు నింపే బాధ్యత నాది అని రాఖీ పండుగ సందర్భంగా మరో సారి ప్రకటిస్తున్నాను. ఆడబిడ్డల బాగుకోసం అహర్నిశలూ పని చేస్తానని హామీ ఇస్తూ అందరికి రాఖీ పండుగ శుభాకాంక్షలు మంత్రి తుమ్మల తెలియజేశారు.

# బూత్ స్థాయి నుంచే యువజన కాంగ్రెస్ ను పటిష్టం చేయాలి

**పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి**

**ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం...**



**నల్లగొండ: అక్షర కలం ప్రతినిధి :**

నల్లగొండ: బూత్ స్థాయి నుంచే యువజన కాంగ్రెస్ ను పటిష్టం చేయాలని మాజీ జెడ్పిటిసి, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి అన్నారు.శనివారం నల్గొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి క్యాంపు కార్యాలయంలో యువజన కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన సమావేశంలో గుమ్ముల మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ కార్యకర్తలంతా కాంగ్రెస్ పార్టీకి సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్ లో క్రమ శిక్షణగా పనిచేస్తే వారికి మంచి గుర్తింపు ఉంటుందని అన్నారు. అదేవిధంగా పార్టీ పరంగా పదవులు వరిస్తాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో నాయకులుగా ఎదగడానికి యువజన కాంగ్రెస్ పునాది లాంటిదని తెలిపారు. యువజన కాంగ్రెస్ లో పనిచేసే కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. అప్పుడే నాయకులుగా ఎదుగుతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చిన విజయవంతం చేయడంలో యువజన కాంగ్రెస్ క్రియాశీలక పాత్ర పోషించాలని కోరారు.యువజన కాంగ్రెస్ నల్లగొండ నియోజక వర్గ అధ్యక్షుడు మామిడి కార్తీక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కత్తుల కోటి, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జహంగీర్ బాబా, యువజన పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, నల్లగొండ మండల అధ్యక్షుడు కె.వి.ఆర్ సతీష్, కంచర్ల ఆనంద్ రెడ్డి, కొప్పు నవీన్ ,పాదం అనిల్,సిద్ధార్థ, రంజిత్ , అజారుద్దీన్, సురేష్, జానకిరామ్, ముజ్జు, సయ్యద్ జానీ, మహమ్మద్ బిలాల్, దాసరి విజయ్, పరశురాం, అజ్జు, వసీం, వినయ్, హలీం ఖాన్ పాల్గొన్నారు.

# సోలార్ సిస్టం ఇన్స్టాలేషన్ పై సమీక్ష సమావేశం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్లాంట్లు**

**- వారంలోపు వివరాలు పంపాలని డిప్యూటీ సీఎం ఆదేశం**

**అక్షర కలం, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**

రాష్ట్రంలోని గ్రామపంచాయతీ భవనం నుంచి సచివాలయం వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు వెల్లడించారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి (ఎనర్జీ) నవీన్ మిట్టల్, రెడ్ కో సి.ఎం.డి., ఎస్.పి.డి.సి.ఎల్. సి.ఎం.డి, సింగరేణి కాలరీస్ సి.ఎం.డి లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సోలార్ సిస్టం ఇన్స్టాలేషన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా నుండి కలెక్టర్ పి. ప్రావీణ్య వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. కలెక్టరేట్లు, పార్కింగ్ ప్రాంతాలు, క్యాంటీన్లు, అలాగే ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపై కూడా సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలు సేకరించి వారం లోపు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు.నీటిపారుదల, రోడ్లు-భవనాల శాఖల పరిధిలోని ఖాళీ స్థలాల వివరాలు కూడా సమర్పించాలని సూచించారు. కలెక్టరేట్లు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే నమూనాలో నిర్మించబడినందున, అవసరమైన డిజైన్లు హైదరాబాద్ నుండి పంపిస్తామని, కలెక్టరేట్ల వద్ద ఉన్న మెరుగైన డిజైన్లు కూడా పంపవచ్చని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద పంపిణీ చేసిన 6.70 లక్షల ఎకరాల భూముల్లో 'ఇందిరా సౌర గిరిజల వికాసం' పథకం ద్వారా ఉచిత సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని, కలెక్టర్లు ఎటువంటి అలసత్వం లేకుండా నిర్ణీత గడువులో వివరాలు పంపాలని ఆదేశించారు. సందేహాలుంటే విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, %ఽ్రాణజూ, చీూణజూ% సీఎండీలు, %=జుణజూ ఎజడవీణ%లను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఖాళీ ప్రభుత్వ స్థలాల వివరాలను నిర్ణీత నమూనాలో అందించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# గ్రామపంచాయతీ భవనం నుంచి మొదలు సెక్రటేరియట్ వరకు అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ లు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

## ఇందిరా సౌర గిరిజల వికాసం వేగవంతం చేయాలి

## ఏజెన్సీ ప్రాంత అధికారులు ఆర్ఓఎఫ్ఆర్ భూముల వివరాలు పంపాలి

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

సోలార్ విద్యుత్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ విధాన నిర్ణయం తీసుకుందని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇట్టి సమీక్ష లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ఎస్పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫారూఖీ, రెడ్కో సిఎండి అనిలా తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ,అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లు హైదరాబాద్ కు పంపాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ లో ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాదు నుంచి పంపిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. కలెక్టర్ కార్యాలయాల్లో






మంచి డిజైన్లు ఉంటే ఆయా కలెక్టర్లు హైదరాబాద్ కు పంపవచ్చని డిప్యూటీ సీఎం సూచించారు. గ్రామపంచాయతీ బిల్డింగ్ మొదలుకొని సెక్రటేరియట్ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు హైదరాబాద్ కు పంపాల్సిన వివరాలకు సంబంధించి ఒక ప్రశ్నావళిని పంపిస్తున్నామని, అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారం లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయానికి పంపాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

ప్రభుత్వ భవనాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీ భవనాలపై కూడా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని అందుకు సంబంధించిన భవనాల వివరాలు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ పరిధిలో పెద్ద ఎత్తున ఖాళీ స్థలాలు ఉన్నాయని, వాటి వివరాలు సైతం పంపాలని కలెక్టర్లకు డిప్యూటీ సీఎం సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిందని, ఈ భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం కలెక్టర్లకు వివరించారు. నల్లమల డిక్లరేషన్ లో భాగంగా ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ప్రారంభించామని, ఈ నెలలోనే 16, 17 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, కలెక్టర్లు ఎక్కడ అలసత్వం ప్రదర్శించకుండా వారంలోగా వివరాలు పంపాలని, ఈ విషయాల్లో ఎలాంటి సందేహాలు ఉన్న విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎస్పీడీసీఎల్, ఎన్పిడిసిఎల్ సీఎండీలు, రెడ్కో విసి%డ%ఎండి ని సంప్రదించాలని డిప్యూటీ సీఎం కలెక్టర్లను ఆదేశించారు.సమీక్ష లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, ఖమ్మం కలెక్టరేట్ లో పార్కింగ్ షెడ్ లు సోలార్ ప్యానెళ్లతో నిర్మించినట్లు తెలిపారు. ఆదేశాల మేరకు కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలు, ఇర్రిగేషన్ భూములు, దేవాదాయ భూముల వివరాలు సమర్పించనున్నట్లు తెలిపారు.ఈ సమీక్ష లో విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఏడిఇ కమర్షియల్ నాగమల్లేశ్వర రావు, రెడ్కో జిల్లా మేనేజర్ అజయ్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయిలో ప్రత్యేక స్థానం ఉంది

**అక్షర కలం /భద్రాచలం**

కొండ కోనల్లో నివసించే ఆదివాసి నివాసి గిరిజనులు సంస్కృతి సాంప్రదాయాలను పాటించడంలో ప్రపంచ స్థాయిలో ప్రత్యేక స్థానం ఉందని, అడవులలో నివసిస్తూ వాగులు వంకలు అటవీ సంపదను కాపాడుకుంటూ జీవనాన్ని పొందుతారని, అటువంటి ఆదిమవాసుల గిరిజనులను ఆదర్శంగా తీసుకుంటే ప్రపంచ దేశ జనాభా సంస్కృతి, సాంప్రదాయాలు పాటించి ఆదివాసి తెగ అంతరించిపోకుండా కాపాడుకున్న వారమవుతామని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం నాడు ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా భద్రాచలంలోని ఆదివాసి గిరిజన భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైనారు. జ్యోతి ప్రజ్వలన చేసి మహనీయుల చిత్రపటాలకు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ,గంటల దొర, మల్లుదొర, కొమురం భీం వంటి ఎందరో ఆదివాసుల ప్రాణ త్యాగాల ఫలితంగా 1982వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి నెదర్లాండ్ లో ఆదివాసీలు స్వేచ్ఛ స్వాతంత్ర్యంగా జీవించడానికి 140 దేశాల ప్రతినిధులు పాల్గొని ప్రపంచ ఆదివాసి దినోత్సవం గా ఆగస్టు 9వ తేదీ నాడు తీర్మానం చేసినందున, ఆరోజు నుండి ప్రపంచం మొత్తం మంది ఆదివాసి తెగల గిరిజనులు వారి వారి సంస్కృతి సంప్రదాయాల పరంగా పండుగల ఆదివాసి దినోత్సవం జరుపుకుంటున్నారని అన్నారు.ఆదివాసీల సంక్షేమానికి ఐటీడీఏ ఎంతో కృషి చేస్తుందని, విద్య వైద్యం వ్యవసాయం మౌలిక వసతులకల్పన, గిరిజన సంక్షేమ హాస్టల్లో విద్యార్థినీ విద్యార్థుల రాష్ట్ర ప్రభుత్వం 40% డైట్ చార్జీలు, వందల శాతం కాస్మోటిక్స్ మరియు కొత్త మెనూ ప్రవేశపెట్టి పిల్లలకు పౌష్టికరమైన ఆహారం అందిస్తుందని, ప్రతి విద్యార్థి చదువుకుంటే ఏదైనా సాధించవచ్చు అని చదువుతోపాటు సాంస్కృతిక సాంప్రదాయాలు మరువకూడదని, ప్రతి గిరిజన కుటుంబాల ఆరోగ్యపరంగా మరియు గిరిజన యువతి యువకులకు వివిధ రంగాలలో శిక్షణ అందించి వారికి స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పొందడానికి సౌకర్యాలు కల్పిస్తున్నామని, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినిలు మన భద్రాచలం నుండి ఆరుగురు డాక్టర్లుగా సీట్లు సంపాదించారని వారిని స్ఫూర్తిగా తీసుకొని మిగతా విద్యార్థులు కూడా డాక్టర్లు ఇంజనీర్లు కావాలని అందుకు విద్యార్థులు బాగా శ్రమించాలని అన్నారు. గిరిజన గ్రామాలలో వైద్యం పరంగా చాలా శ్రద్ధ తీసుకుంటున్నామని చెర్ల మణుగూరులలో సిహెచ్ సి సెంటర్లు ప్రారంభించి అధునాతన వైద్య పరికరాలతో డయాలసిస్ సెంటర్లు కూడా ప్రారంభించడం జరిగిందని అన్నారు. పోడు వ్యవసాయం చేసుకునే గిరిజన రైతులకు సబ్సిడీతో వెదురు




మునగ పామాయిల్ పంటలు వేసుకునేలా ప్రోత్సహిస్తున్నామని, అలాగే చేపల పెంపకం ద్వారా కూడా ఆర్థిక పరిపుష్టి చెంది జీవనోపాధి పెంపొందించుకోవాలని అన్నారు. ఆదివాసి గిరిజన యువకులు భాషతోపాటు శాస్త్రీయ పరంగా కూడా మార్పులు రావాలని ప్రతి ఒక్కరికి వివిధ రంగాలలో శిక్షణ అందిస్తామని అలాగే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేలా చిన్న పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. గిరిజన సంక్షేమానికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని ముఖ్యంగా కొండరెడ్ల సంక్షేమానికి పాటుపడతానని అన్నారు. అంతకుముందు ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ మరియు సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, మరియు వివిధ ఆదివాసి సంఘాల నాయకులతో కలిసి స్థానిక అంబేద్కర్ కూడలి దగ్గర ఉన్న ఆదివాసి తెగల గిరిజనుల కోసం పోరాడిన అమరవీరుల స్థూపాలకు పూలమాలవేసి ఆదివాసి జెండా ఆవిష్కరణ చేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసి గిరిజనుల పిల్లల కొరకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఆశ్రమ పాఠశాలలు ,వసతిగృహాలు గురుకుల పాఠశాలలు నెలకొల్పి వారి విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ,గిరిజనులు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక చేకూర్పు చేసుకొని జీవించడానికి ఐటిడిఏ ద్వారా అనేక రకాల సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులకే అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లా కలెక్టర్ మరియు పిఓ, సబ్ కలెక్టర్ గిరిజన అభివృద్ధి కోసం ఉత్సాహం చూపుతున్నారని, గిరిజనులకు సంబంధించిన ఏ సమస్య ఉన్న మా దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. అనంతరం గిరిజన భవన్లో ఏర్పాటుచేసిన ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలకు సంబంధించిన నృత్యాలను వారు తిలకించారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ ఆదివాసి నాయకులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ గిరిజన సంక్షేమానికి మరియు ఆదివాసి గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలు, గిరిజన విద్యార్థినీ విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు, కోయ బాషా పరిరక్షణ కొరకు మరియు గిరిజన తెగల ఇలవేల్పుల పరిశోధనకు చూపిస్తున్న అభిమానాన్ని గుర్తించి వివిధ గిరిజన సంఘాల నాయకులు పిఓను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ , ఏవో సున్నం రాంబాబు,ఏసీఎంఓ రమేష్, ఏటిడిఓ అశోక్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ హరీష్, ఏడి అగ్రికల్చర్ భాస్కర్, ఆర్ సి ఓ, డి ఎం జిసిసీ సమ్మయ్య, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, డి టి ఆర్ ఓ ఎఫ్ ఆర్ లక్ష్మీనారాయణ, జి సి డి ఓ అలివేలు మంగతాయారు, ఏపీవో పవర్ వేణు, డీఎస్ఓ ప్రభాకర్ రావు, జేడీఎం హరికృష్ణ,గిరిజన సంఘాల నాయకులు పూణే కృష్ణ దొర ,పాయం రవి వర్మ, శరత్ బాబు, మురళి, రమేష్, పుల్లయ్య, వీరస్వామి, సుధారాణి ,అరుణ ,వెంకటరావు వీరభద్రం వివిధ గ్రామాల నుండి వచ్చిన గిరిజన సంఘాల నాయకులు, పాఠశాల విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదానికి గురైన రక్షణ విమానం

**ముంబై,**

మహారాష్ట్రలో ప్రమాదం చోటు చేసుకుంది. పూణె జిల్లాలోని బారామతి విమానాశ్రయం సమీపంలో శనివారం ఉదయం ఓ శిక్షణ విమానం ప్రమాదానికి గురైంది. అయితే, అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 8 గంటల సమయంలో శిక్షణ విమానం గాల్లో ఉండగా అందులోని టైర్లలో ఒకటి దెబ్బతిన్నట్లు పైలట్ గుర్తించారు. దీంతో విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేసేందుకు ప్రయత్నించారు. అయితే ల్యాండింగ్ తర్వాత ముందు చక్రం ఊడిపోయింది. దీంతో విమానం ట్యాక్సీవే నుంచి అదుపుతప్పి ఎయిర్‌పోర్ట్ అవతలివైపుకు దూసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని చెప్పారు. ఈ ప్రమాదం నుంచి పైలట్ సురక్షితంగా బయటపడ్డట్లు వివరించారు.

# రాహుల్ అసత్య ఆరోపణలు: అసోం సిఎం

**గువహటి,**

బీజేపీ గెలిచిన ప్రతిసారీ ఎన్నికల పక్రియలో తప్పులు జరిగాయని ఆరోపించడం కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి అలవా-టైపోయిందని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ మండిపడ్డారు. దేశంలో బీజేపీ, ఎన్నికల కమిషన్ కుమ్మక్కయి ఎన్నికల్లో భారీ మోసానికి పాల్పడ్డాయని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై హిమంత స్పందించారు. రాహుల్ గాంధీ ఎన్నికల్లో గెలిచినప్పుడు.. అంతా బాగానే ఉంటుందని, బీజేపీ గెలిచినప్పుడు మాత్రం తప్పు జరుగుతుందా? అని ప్రశ్నించారు. 'కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటక, తెలంగాణలో 'ఓటు- చోరీ' జరగలేదా? బీజేపీ గెలిస్తే మాత్రం 'ఓటు- చోరీ' జరుగుతుందా' అని ఆయన నిలదీశారు.

# చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మీ జన్మదిన వేడుకలు......



**నాంపల్లి :అక్షర కలం/ ప్రతినిధి :**

ఈరోజు నాంపల్లి మండలంలో అంబేద్కర్ చౌరస్తాలో శ్రీమతి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మీ గారి జన్మదిన వేడుకలు నాంపల్లి లిమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మరియు సీనియర్ నాయకులలి ఆదేశానుసారం మరియు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నేతల కొండలు యాదవ్ గారి ఆధ్వర్యంలో లిపుట్టినరోజు వేడుకలు ఘనంగా ని ర్వహించడంలిజరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు రాజన్న అభిమానులు మహిళలు మరియు, మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య గారు టౌన్ అధ్యక్షులు వెంకటయ్య గౌడ్ మాల్ మార్కెట్ డైరెక్టర్ పూల యాదగిరి విరమల్ల సందీప్ గౌడ్ పల్లె రామలింగం, మాజీ సర్పంచ్ కోట నరసింహ దోటి పరమేష్ బిరుదోజు సుదర్శన చారి కోరే కిషన్ మహిళా నాయకురాలు బిర్డోజు ఉషా%జ% రాణి యూత్ కాంగ్రెస్ నాయకులు గదేపాక నాగరాజు ఛత్రపతి కమిశెట్టి నాగరాజు కోరే శివ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది....

# ఘనంగా గాయత్రీ యజ్ఞం...

**ధర్మాన్ని మనం రక్షిస్తే ధర్మం మనల్ని రక్షిస్తుంది.**



**అక్షర కలం, కొండమల్లేపల్లి.**

అఖిల విశ్వ గాయత్రీ పరివార్ శాంతి కుంజ్ హరిద్వార్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి లో శనివారం గాయత్రీ యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర దేవాలయం వద్ద నిర్వహించిన ఈ గాయత్రీ ఐదు కుండలీల యజ్ఞ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.మండల పద్మశాలి సంఘం నాయకులు యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆలయ పురోహితులు ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడారు. ధర్మాన్ని మనం రక్షిస్తే ఆ ధర్మం మనల్ని రక్షిస్తుందని అన్నారు. రాఖీ పౌర్ణమి రోజు శనివారం గాయత్రీ యజ్ఞాన నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. ప్రతి నెలలో పౌర్ణమి రోజు శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర ఆలయంలో గాయత్రీ యజ్ఞాన్ని నిర్వహిస్తామన్నారు. లోకా సమస్త సుఖినోభవంతు అని ప్రతిరోజు పూజించేది హిందువులు మాత్రమేనని హిందూ ధర్మం చాలా గొప్పది అని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సత్ప్రవర్తన, భక్తి భావాన్ని నేర్పించాలన్నారు. భగవద్గీత గ్రంథాన్ని పఠనం చేయించాలని సూచించారు. ఆలయాలలో జరిగేటటువంటి భక్తి కార్యక్రమాలలో తమ వంతుగా హిందువులందరూ పాల్గొనాలన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచారు. ఈ కార్యక్రమంలో అఖిల విశ్వ గాయత్రీ పరివార్ శాంతి కుంజు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, పురోహితులు పాల్గొన్నారు.

# అన్నా చెల్లెలు అనుబంధానికి ప్రతీక "రాఖీ" " - కాంగ్రెస్ నేత "చల్లా కృష్ణ"

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

దానవాయిగూడెంబీ అనుబంధానికి ప్రతీక రాఖీ పర్వదినాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఆర్టీసీ సైతం మహిళలకు లక్కీ డ్రా ఏర్పాటు చేసింది. అక్క, చెల్లెల్లు వారి అన్నా, తమ్ముళ్లకు రాఖీ లు కట్టేందుకు దూర తీర ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. చెల్లెలు



కోసం, అక్క కోసం అన్నా, తమ్ముళ్లు కూడా సమయాన్ని కేటాయించి మరీ రాఖీలు కట్టించి సోదర బంధాన్ని చాటు కున్నారు దాన్వాయిగూడెం 59వ, డివిజన్ కు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడు కాంగ్రెస్ సీనియర్ నేత "చల్లా కృష్ణ" రాఖీ పౌర్ణమి సందర్భంగా దానవాయి గూడెం సోదరీ సోదరీమణులకు ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు,

# ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సందర్శించిన పోలీస్ కమిషనర్







**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్వహణను పరిశీలించెందుకు ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్ స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి, ట్రాఫిక్ నిర్వహణలో ఉన్న సవాళ్లను మరియు అవకాశాలను గురించి చర్చించారు. ముఖ్యంగా నగరంలో ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడానికి మరియు ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి కృషి చేయాలని,ఎంఫోర్సమెంట్ పై దృష్టి పెట్టాలని అదేశించారు. సిసిటివి కెమెరాల విస్తరణ, ట్రాఫిక్ సమస్య, సంఘటన సమయంలో ప్రతిస్పందన, జరిమానాల వసూలు, ట్రాఫిక్ పరికరాలపై సమీక్ష జరిపారు. అదేవిదంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా వ్యక్తిగత సంస్థలు మరియు మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల సమన్వయంతో సరైన పార్కింగ్ స్థలాలను గుర్తించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాల పార్కింగ్ మరియు నిర్వహణను పరిశీలించారు. ఇది కాకుండా, ఇతర ట్రాఫిక్ నిర్వహణ పద్ధతులపై చర్చించారు.

# ప్రజలంతా ఘనంగా జరుపుకునే రాఖీ పౌర్ణమి సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుంది....

**ములుగు నియోజకవర్గ ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు...**

**ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుకాకులమర్రి లక్ష్మణ్ బాబు**

**ములుగు జిల్లాప్రతినిధి( అక్షర కలం ) ఆగస్టు 9**



తోడబుట్టినఅన్నాచెల్లెళ్లు,అక్కాతమ్ముళ్ల నడుమ అనురాగ బంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్(రాఖీ పౌర్ణమి) పండుగ సందర్భంగా బి ఆర్ ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు జిల్లా నియోజకవర్గ ప్రజలందరికీ లిరక్షా బంధన్(రాఖీ పౌర్ణమి)లిశుభాకాంక్షలు తెలుపారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ బంధాలు,రక్త సంబంధాల్లోని ఔన్నత్యాన్ని,మానవ సంబంధాల్లోని పరమార్థాన్ని రాఖీ పండుగ తెలియజేస్తుందన్నారు.భారతీయ సంస్కృతికి,జీవనతా త్వికతకు రాఖీ పండుగ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.రాఖీని రక్షా బంధంగా భావించే ప్రత్యేక సంస్కృతి మనదని తెలిపారు.అన్నాదమ్ముళ్లకు రాఖీలు కట్టడం ద్వారా తమకు రక్షణగా నిలువాలని అక్కాచెల్లెళ్లు ఆకాంక్షిస్తారని కాకులమర్రి లక్ష్మణ్ బాబు పేర్కొన్నారు.

# సోదర భావంతో మంత్రికి రాఖీలు



**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

శనివారం ఖమ్మం క్యాంపు కార్యాలయం పండుగ వాతావరణంలో మెరిసింది. వివిధ హోదాల్లో ఉన్న మహిళలు, గృహిణులు రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి సోదర భావంతో రాఖీలు కట్టి శుభాకాంక్షలు అందించారు."మీరు మా సోదరుడు మాత్రమే కాదు%ౌ% మా కుటుంబానికి అండ" అని పలువురు మహిళలు హృదయపూర్వకంగా పేర్కొన్నారు. మంత్రి కూడా స్నేహపూర్వకంగా పలకరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుభకార్యక్రమాలకు హాజరైన మంత్రి, అక్కడ కూడా మహిళల నుంచి రాఖీలు కట్టించుకున్నారు.

# డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరికీ పోలీసుల విన్నపం.

**అక్షర కలం / ప్రతినిధి :**

1.ఈ భూమిపై మరో జన్మ పొందటానికి తల్లి గర్భంలో 9 నెలలు వేచి చూడాలి.
2. నడవడానికి 2 సంవత్సరాలు.
3. స్కూల్ కి వెళ్ళడానికి 3 సంవత్సరాలు,
4. ఓటు హక్కు కై 18 సంవత్సరాలు,
5. ఉద్యోగం కోసం 25 సంవత్సరాలు,
6. పెళ్ళికోసం 25నుండి 30 సంవత్సరాలు... ఇలా ఎన్నో సందర్భాలలో (వెయిట్) వేచి ఉంటాము.

కానీ...ఓవర్ టేక చేసే సమయంలో.. వాహనాలు నడుపుతున్నపుడు, 30 సెకన్లు కూడా ఆగలేక పోతున్నాము.తర్వాత తప్పిపోయి ఏమన్నా యాక్సిడెంట్ అయితే హాస్పిటల్ లో గంటలు, రోజులు, వారాలు, నెలలు, అవసరమైతే సంవత్సరాలు కూడా కోలుకోలేని పరిస్థితి..కొన్ని సెకన్ల గడబిడ ఎంత భయంకరమైన పరిణామాలు ఎదుర్కొంటున్నారో ఆలోచించండి.ముందు వెళ్ళేవారు వెళ్ళనీ.. వెనకాల హాయిగా వెళ్ళిపో..దయచేసి సరైన వేగం, సరైన దిశలో ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ..హెల్మెట్ వాడుతూ.. వాహనాలు నియంత్రణలో ఉంచుకొని నడపండి. మరియు సురక్షితంగా మీ గమ్యాన్ని చేరుకోండి.మీ కోసం, మీ యొక్క కుటుంబ సభ్యులు, పిల్లలు మీ ఇంటి వద్ద ఎదురు చూస్తుంటారని మరవకండి.. జాగ్రత్తగా వెళ్ళండి..




# రాష్ట్ర రాజధానిలో ఘనంగా రాఖీ వేడుకలు నిర్వహించిన మంత్రి సీతక్క

**"సోదరి సీతక్క" కు కృతజ్ఞతలు తెలియజేసిన ప్రముఖులు రాష్ట్ర మంత్రివర్యులు.**







**హైదరాబాద్, ఆగస్టు 9, అక్షర కలం:**

తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క రాఖీ పండుగను రాష్ట్ర రాజధానిలో ఘనంగా జరిపారు. సోదర సోదరీమణుల అనుబంధాన్ని ప్రతిబింబించే ఈ పండుగ సందర్భంగా, సీతక్క స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, హైదరాబాదులో అందుబాటులో ఉన్న మంత్రులు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, నేతల నివాసాలను సందర్శించారు. ప్రతి ఒక్కరి చేతికి రాఖీ కట్టి, స్వీట్లు తినిపించి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు మంత్రి సీతక్క. నాయకులు తమ సొంత సోదరిగా భావించి సీతక్కను ఆప్యాయంగా ఆహ్వానించారు. రాఖీ కట్టించుకుంటూ "సోదరి సీతక్క" అంటూ ఆత్మీయంగా పలకరించి, ఆశీర్వాదాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.సీతక్క రాకతో సీఎం, మంత్రుల నివాసాలు సోదర భావంతో నిండిపోగా, పండుగ వాతావరణం మరింత ఉత్సాహంగా మారింది. ఈ సందర్భంగా సీతక్క "రాఖీ పండుగ మన మధ్య ఉన్న అనుబంధాలను మరింత బలపరుస్తుంది. ఇలాంటి సోదర భావం, పరస్పర గౌరవం ఎల్లప్పుడూ కొనసాగాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.ఉదయం తన నివాసమైన ప్రజాభవన్‌కు విచ్చేసిన ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ కి మంత్రి సీతక్క రాఖీ కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తన నివాసం కి విచ్చేసిన నాయకులు, భద్రతా సిబ్బంది, వ్యక్తిగత సిబ్బందికి సీతక్క రాఖీలు కట్టి ఆశీర్వదించారు. ప్రజా పాలనలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వెలుగొందాలని ఆమె ఆకాంక్షించారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.....



హైదరాబాద్/ అక్షర కలం

పెద్ద అంబరపేట్ లోని నిధి కన్వెన్షన్ లో జరిగిన బొప్పిడి కరుణాకర్ రెడ్డి గారి కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు.

## యూత్ కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు......



నల్లగొండ: అక్షర కలం / ప్రతినిధి:

నల్లగొండ పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారి క్యాంపు కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, నల్లగొండ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మామిడి కార్తీక్, నల్గొండ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజుతో పాటు పలువురు మండల యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాఖీ పండుగ అన్నాచెల్లెల్ల అనుబంధానికి ప్రతీక

బాగా చదివి ప్రయోజకులుగా ఎదగాలి

బాల సదన్ భవన్ లో రాఖీ పండుగ వేడుకలో పాల్గొన్న.....

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట :అక్షర కలం/ ప్రతినిధి:






రాఖీ పండుగ అన్నాచెల్లెల్ల అనుబంధానికి ప్రతీక అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం బాలభవన్ లో చిన్నారులతో కలిసి జిల్లా కలెక్టర్ రాఖీ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలసదన్ లోని చిన్నారులు కలెక్టర్ కి రాఖీలు కట్టి, ఆప్యాయత పంచుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు బాగా చదివి ప్రయోజకులుగా ఎదగాలని ఆకాక్షించారు. ఏమైనా సమస్య లు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. 2 నెలలో నూతన చిల్డ్రన్ హోమ్ పూర్తి అవుతుందని తెలిపారు. కలెక్టర్ చిన్నారులకు డ్రస్ లు, రైన్ కోట్స్, పెన్నులు, లూడో, చెస్, షటిల్ ఆట వస్తువులు మిఠాయిలు, బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమం లో జిల్లా బాల సంరక్షణ అధికారి రవి, సూపరిటీడెంట్ మంగాతాయమ్మ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం అడుగులు




గ్రామపంచాయతీ భవనం నుంచి మొదలు సెక్రటేరియట్ వరకు అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ లు.

ఇందిరా సౌర గిరిజల వికాసం వేగవంతం చేయాలి.




ఏజెన్సీ ప్రాంత అధికారులుఆర్ ఓ ఎఫ్ ఆర్ భూముల వివరాలు పంపండి.

జిల్లా కలెక్టర్లతో విద్యుత్ శాఖ పై సెక్రటేరియట్ నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు వీడియో కాన్ఫరెన్స్.

ములుగు జిల్లా ప్రతినిధి( అక్షర కలం) ఆగస్టు 9

రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి (ఎనర్జీ) నవీన్ మిట్టల్, రెడ్ కో సి.ఎం.డి., ఎస్.పి.డి.సి.ఎల్. సి.ఎం.డి, సింగరేణి కాలరీస్ సి.ఎం.డి లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సోలార్ సిస్టం ఇన్స్టాలేషన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇందు కొరకు రాష్ట్రంలోని ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు, ఆర్. ఓ. ఎఫ్. ఆర్. భూముల వివరాలతో నిర్ణీత నమూనా ప్రకారం నివేదిక రూపొందించి వారం రోజులలోగా సమర్పించాలని తెలిపారు. జిల్లాలలో గల ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల భవనాల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని జిల్లాల కలెక్టర్లు వారంలోగా సంబంధిత వివరాలను ఎనర్జీ డిపార్ట్మెంట్ కు పంపించాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలలోని 6 లక్షల 17వేల ఎకరాలలో సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈ క్రమంలో 3 సంవత్సరాల లోపు ప్రక్రియ పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, కాళీ ప్రభుత్వ స్థలాల వివరాలను నిర్ణీత నమూనాలో అందించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డి ఈ నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన తాడ్వాయి మాజీ జడ్పిటిసి రామ సహాయం శ్రీనివాస్ రెడ్డి ..

ములుగు జిల్లా ప్రతినిధి( అక్షర కలం)





శనివారం తాడ్వాయి మండలంలోని కాటాపూర్ గ్రామానికి మండల నవతెలంగాణ రిపోర్టర్ తమ్మళ్ల సమ్మయ్య గౌడ్ కుటుంబాన్ని పరామర్శించి 10,000 రూపాయల ఆర్థిక సహాయం తో పాటు 50 కేజీల బియ్యం అందించారు. అదే గ్రామానికి చెందిన జూపాక లక్ష్మీ నరసమ్మ కుటుంబాన్ని పరామర్శించి కొంత నగదు తో పాటు 50 కిలోల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో మండ్రాతి రాజమౌళి, జాజ చంద్రం, ఇంద్రారపు లాలయ్య, నుశెట్టి రమేష్, దానక నర్సింగరావు, రంగు సత్యనారాయణ, దాయ రోశయ్య, బాసాని రామకృష్ణ, జాజ వెంకన్న, దీలివరీఖాన్, అర్రం కృష్ణ, సాయిరి లక్ష్మీనరసయ్య, లంజపల్లి రాంబాబు, లంజపల్లి వెంకటేశ్వర్లు, పల్లెర్ల మహేశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ దొంగల కోటయ్య మృతికి "తమ్మినేని" నివాళి

– ఎర్ర జెండా కప్పి నివాళులర్పించిన సిపిఎం నేతలు..

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:



ఖమ్మం: సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ దొంగల కోటయ్య శనివారం ఉదయం గుండెపోటుతో మరణించారు. వారి పార్థివ దేహం పై ఎర్రజెండా కప్పి, పూలదండలు వేసి సిపిఎం నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కళ్యాణ%శీ% వెంకటేశ్వరరావు, వై విక్రమ్, బండి రమేష్, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి పద్మ, బొంతు రాంబాబు, ఖమ్మం నియోజకవర్గ బాధ్యులు జబ్బర్ మీరా సాహెబ్, ఎస్ నవీన్ రెడ్డి, భూక్యా శ్రీను, సుదర్శన్, బత్తిని ఉపేందర్, నాగులు మీరా తదితరులు పాల్గొన్నారు. కామ్రేడ్ దొంగల కోటయ్య చిన్నతనం నుండే ఎర్రజెండా బావాలకి ఆకర్షితులై నాటునుండి చనిపోయే వరకు ఎర్రజెండాను వదలకుండా నిలిచాడని అన్నారు. టేకులపల్లి ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారన్నారు. నిజాయితీకి నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన కామ్రేడ్ కోటయ్య మరణం పార్టీకి తీరనిలోటు అన్నారు. కామ్రేడ్ కోటయ్య కుటుంబం యావత్తు పార్టీలో పనిచేస్తున్నారు అన్నారు. కోటయ్య కుమారుడు దొంగల తిరుపతరావు సిపిఎం ఖానాపురం హవేలీ మండల కార్యదర్శిగా పనిచేస్తున్నారు.



## ఆదివాసీల హక్కులను హరిస్తున్నారు

– గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు "వజ్జా రామారావు"..



అక్షర కలం/ కారేపల్లి:

– ఖమ్మం: ప్రభుత్వాలు మారినా.. ఆదివాసీల పరిస్థితి మాత్రం మారడం లేదని, ఆదివాసీల హక్కులను హరిస్తున్నారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు వజ్జా రామారావు పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని కారేపల్లి మండలంలోని పాటిమీద గుంపులో శనివారం ఆదివాసీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్నదని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు ఆదివాసీల సమస్యల పరిష్కారంలో మాత్రం నిమ్మకునీరెత్తి నట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పోడు భూములే జీవనాధారంగా జీవిస్తున్న ఆదివాసీలకు పట్టాలిప్పిస్తామని ఎన్నికల ముందు మాటిచ్చి అధికారంలోకి రాగానే కేసీఆరే ప్రభుత్వం చేసినట్లుగానే ప్రజా పాలన అంటున్న నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పోడు భూముల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



. ఆదివాసీల హక్కులను అమలు చేయాలి

. ఎర్రబోడు మాజీ సర్పంచి కుర్సం సత్యనారాయణ

ఆదివాసీల హక్కులను అమలు చేయాలని ఎర్రబోడు మాజీ సర్పంచి కుర్సం సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా "ఎర్రబోడులో" ఆదివాసీల జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ.. పోడు భూములే జీవనాధారంగా జీవిస్తున్న గిరిజనులకు పట్టాలివ్వాలని,లేదా ప్రత్యన్మయం చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పండగ కొండయ్య నర్సింగ్ సత్యనారాయణ పూణేం బాబు ఎర్రబోడు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955